

పెన్షన్ల ఇంటింటి పంపిణీని టీడీపీయే అడ్డుకుందని వాట్సా్ప్‌లలో ప్రచారం చేస్తున్న వలంటీర్లు

అవ్వాతాతలతోనూ ఆటలా?



- పింఛన్లపై జగన్‌రెడ్డి రాజకీయంపై మండిపడుతున్న వృద్ధులు
- టీడీపీ వల్లే పంపిణీ ఆలస్యమంటూ వలంటీర్ల ప్రచారం
- ఒక్కో సచివాలయ ఉద్యోగి 61 మందికి పింఛన్లు ఇస్తే చాలు

చిత్తూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ జగన్ పింఛన్ల డ్రామాకు తెరతీశారు. వలంటీర్లు పింఛన్లు పంచరాదన్న ఎన్నికల కమిషన్ నిర్ణయానికి కారణం టీడీపీ అంటూ నింద మోపుతున్నారు. వైసీపీ నాయకుల ఆదేశాలతో సోమవారం జిల్లాలో చాలా చోట్ల వలంటీర్లు ఇళ్లవద్దకు వెళ్లి టీడీపీ మీ పింఛను ఆపేయించిందని ప్రచారాలు కూడా మొదలు పెట్టారు. తొలి నుంచీ వలంటీర్లు.. వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు రావడంతో కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది. నిజానికి పింఛన్లు ఇళ్లవద్దకే పంపిణీ చేయడం ఈ రెండు నెలలూ కష్టం కూడా కాదు. సచివాలయ ఉద్యోగులతో ఈ పని పూర్తి చేయచ్చు. అయినా 3వ తేదీన సచివాలయాలకే వచ్చి తీసుకోవాలని జగన్‌రెడ్డి ప్రభుత్వం జీవో జారీ చేసిన తీరుమీద అవ్వాతాతలు మండిపడుతున్నారు. ఈ ఎండల్లో ఇదేమి హింస అని ప్రశ్నిస్తున్నారు.

ఇలా పింఛన్లు ఇళ్ల వద్దకే పంపచ్చు..

వాస్తవానికి జిల్లాలో 108 వార్డు, 504 గ్రామ.. మొత్తంగా 612 సచివాలయాలున్నాయి. వాటిలో 768 మంది అర్బన్, 3677 మంది రూరల్ ప్రాంతాల్లో ఉద్యోగులు పనిచేస్తున్నారు. జిల్లాలో 16రకాల పెన్షన్లు 274,146 ఉన్నాయి. వీటిని ప్రతి నెలా వలంటీర్లు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 8వేల మంది పనిచేస్తున్నారు. అంటే ఒక్కో వలంటీర్ సగటున 34 మందికి పెన్షన్లను అందించేవారు. ఇప్పుడు జిల్లాలో సచివాలయ ఉద్యోగులు 4445 మంది పనిచేసున్నారు. ఈ లెక్కన వలంటీర్ల సంఖ్యలో సగం మంది సచివాలయ ఉద్యోగులున్నారు. వీరి వద్ద పెన్షన్ల పంపిణీ చేసేందుకు అవగాహన, సంబంధిత యంత్రాలూ ఉంటాయి. సగటున ఒక్కో సచివాలయ ఉద్యోగి పరిధిలోకి 61 పెన్షన్లు వస్తాయి. గట్టిగా పంపిణీ చేస్తే ఒక్క రోజులో పూర్తి చేయవచ్చు. ఇలా ప్రత్యామ్నాయ మార్గం ఉన్నా, ప్రభుత్వం మాత్రం వలంటీర్లు లేక సచివాలయాల వద్దే పంపిణీ చేస్తున్నట్లు బుకాయిస్తోంది.

దాసేగౌనూరు గ్రామస్తులపై వైసీపీ సర్పంచ్ దాడి

నా ప్రమేయం లేకుండా పనులెలా చేస్తారంటూ ఆగ్రహం

కుప్పం, ఏప్రిల్ 1: తన ప్రమేయం లేకుండా గ్రామస్తులే సొంతంగా పనులు చేసుకోవడం ఓ వైసీపీ సర్పంచ్‌కి ఆగ్రహాన్ని తెప్పించింది. ఇంకేముంది ఆ పనులను అడ్డుకోవడానికి ఆగమేఘాలపై వచ్చాడు. ఈ సందర్భంగా ఇద్దరు గ్రామస్తులపై దాడిచేసి, గాయపరిచాడు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. కుప్పం మండలం దాసేగౌనూరు నుంచి నాగప్పకొటాలు అనే ప్రాంతానికి గ్రామస్తులంతా కలిసి సోమవారం సొంతంగా పైపులైన్లు వేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న దాసేగౌనూరు పంచాయతీకి చెందిన వైసీపీ సర్పంచ్ మురుగేశ్ తన తండ్రి జయశంకర్‌తో కలిసి గ్రామస్తుల వద్దకొచ్చాడు. తన ప్రమేయం లేకుండా పనులెలా చేస్తారని మండిపడగా, దీనికి గ్రామస్తులూ ఎదురుతిరిగారు. ఈ సందర్భంగా రామ్‌నగర్‌కి చెందిన చంద్రన్, దొరైలపై సర్పంచ్ తన తండ్రితో కలిసి దాడి చేసి, గాయపరిచాడని గ్రామస్తులు తెలిపారు. బాధితులు ప్రస్తుతం కుప్పం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం చేరారు. వారు మాట్లాడుతూ.. సర్పంచ్ పలుమార్లు తన వద్ద ఉన్న నాటు తుపాకీతో కాల్చేస్తామని బెదిరించాడని, భూములను ఆక్రమించడానికి కూడా ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. సర్పంచ్ నుంచి తమకు ప్రాణహాని ఉందని, ఆయన వద్ద ఉన్న నాటు తుపాకీని స్వాధీనం చేసుకుని రక్షణ కల్పించాలని కోరారు. ఈమేరకు కుప్పం అర్బన్ పోలీసులకూ ఫిర్యాదు చేశామన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు సర్పంచ్, ఆయన తండ్రిపై కేసు నమోదు చేసినట్లు సీఐ షణ్ముగం తెలిపారు.



కుప్పం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న దొరై, చంద్రన్

మొదలైన టెన్త్ 'స్పాట్'

- గైర్హాజరైనవారికి షోకాజ్, మెమోల జారీ
- డీఈవో తీరుపై పలువురి అసహనం

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 1: టెన్త్ జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్) సోమవారం స్థానిక పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొదలైంది. సబ్జెక్టుల వారీగా.. తెలుగు 25307, హిందీ 37,866, ఇంగ్లీష్ 20,755, గణితం 11257, ఫిజికల్ సైన్స్ 25,348, బయాలజీ 29,420, సోషియల్ స్టడీస్ 23,848, మైనర్ మీడియా 4802 పేపర్లు మూల్యాంకనం చేసేందుకు జిల్లాకు వచ్చినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. తొలి రోజున స్పాట్‌లో సిబ్బంది కొరత ఏర్పడింది. హిందీ సబ్జెక్టుకు తొమ్మిది మంది కొరత ఏర్పడగా, అధికారులు వెంటనే అవసరమైన టీచర్లను పిలిపించి సర్దుబాటు చేశారు. ఇక బయాలజీ సబ్జెక్టుకు 16 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు గైర్హాజరవగా, వీరికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. అలాగే గైర్హాజరైన మరో 30మంది స్పెషల్ అసిస్టెంట్లకు మెమోలు ఇచ్చినట్లు డీఈవో తెలిపారు.

నిబంధనలకు తూట్లు : స్పాట్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ల అనుమతి లేదు. అయితే పలువురు టీచర్లు తరచూ సెల్‌ఫోన్లు వినియోగిస్తూ నిబంధనలకు తూట్లు పొడిచినా.. అధికారులు పట్టించుకోక పోవడం విమర్శలకు దారితీసింది. ఇక అనారోగ్య సమస్యలున్న టీచర్లకు మెడికల్ సర్టిఫికెట్ ఆధారంగా మెడికల్ గ్రౌండ్స్ కింద స్పాట్ నుంచి మినహాయింపు ఇవ్వకపోవడంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు, టీచర్లు డీఈవోపై అసహనం వ్యక్తం చేశారు. డీఈవో తీరుపై సంఘాల నేతలు రాష్ట్ర స్థాయి విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.



ఎండ తట్టుకోలేక తలపై గుడ్డతో..

భానుడి భగభగలు

40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 1: జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. 37 నుంచి 40 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భానుడి భగభగలకు జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. సోమవారం అత్యధికంగా పెద్దపంజాణిలో 41.2, అత్యల్పంగా రామకుప్పంలో 34.8 డిగ్రీలు నమోదైంది. మండలాల వారీగా.. చిత్తూరు, తవణంపల్లెల్లో 40.9, గుడుపల్లెలో 40.4, నదుం, పుంగనూరులో 40.2, విజయపురంలో 40.1, బంగారుపాళ్యంలో 39.7, నింద్రలో 39.3, ఎస్ఆర్‌పురంలో 38.9, గుడిపాల, పులిచెర్ల, చౌడేపల్లె, యాదమరిల్లో 38.6, సోమల, పాలసముద్రంలో 38.5, వెదురుకుప్పంలో 38.4, గంగవరంలో 38.3, జీడీ నెల్లూరులో 38.1, కుప్పంలో 38, పెనుమూరులో 37.8, బైరెడ్డిపల్లెలో 37.7, శాంతిపురం, పలమనేరులో 37.4, వి.కోట, కార్వేటినగరంలో 37.2, ఐరాలలో 37, పూతలపట్టులో 36.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

భక్తుల పాలిట కల్పవల్లి సుగుటూరు గంగమ్మ

నేటినుంచి పుంగనూరు గంగజాతర

పుంగనూరు, ఏప్రిల్ 1: భక్తులపాలిట కల్పవల్లిగా, ఆరోగ్య వరప్రదాతగా పేరుగాంచిన పుంగనూరు సుగుటూరు గంగమ్మ జాతర జమీందారీ వంశస్తుల ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏటా ఉగాది పండుగకు ముందు వచ్చే మంగళవారం పుంగనూరుతోపాటు పరిసర 100గ్రామాల్లో గంగజాతర నిర్వహిస్తారు. పుంగనూరు జమీందారుల ఇలవేల్పు అయిన సుగుటూరు గంగమ్మ జాతర మంగళవారం ప్రారంభమై బుధవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు, నిమజ్జనంతో ముగుస్తుంది. మంగళవారం పుంగనూరులో భారీఎత్తున గొర్రెపొట్టేళ్ల సంత జరుగుతుంది.





సుగుటూరు గంగమ్మ - విద్యుత్ దీపాలంకరణలో జమిందారీ ప్యాలెస్

ఒక్కరోజే దర్శనం

కోపమూర్తులైన సుగుటూరు గంగమ్మ, నడివీధి గంగమ్మను ఏడాదిలో ఒక్కరోజు మాత్రమే జాతర సందర్భంగా జనం మధ్యకు తీసుకొచ్చి పూజలు నిర్వహిస్తారు. జమీందారి సంతతి వారు ప్యాలెస్‌లో మంగళవారం తొలిపూజ తర్వాత అష్ట గంగమ్మలైన పాత బస్టాండు సమీపంలోని విరూపాక్షి మారెమ్మ, తూర్పుపాలెంలో స్థలగంగమ్మ, పలమనేరు రోడ్డులోని మల్లారమ్మ, తూర్పు మొగసాలలోని నల్లగంగమ్మ, కట్టకిందపాళ్యంలోని పడమటి గంగమ్మ, పుంగమ్మకట్టపై నీళ్లరాళ్ల గంగమ్మ, కోనేరు వద్దగల బోయకొండ గంగమ్మలను పలకరిస్తూ ఊరేగింపు సాగుతుంది. బుధవారం తెల్లవారుజామున ప్యాలెస్ వద్ద ఉన్న ఆలయంలో ప్రతిష్ఠించి బెస్త, యాదవ, తోటి కులస్తులు పూజలు చేస్తారు. కాగా, సోమవారం మున్సిపల్, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. జమీందారులు సోమశేఖర్ చిక్కరాయులు, మల్లికార్జున చిక్కరాయులతో కలిసి మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, పలువురు ప్రముఖులు గంగమ్మ ఆలయం వద్ద పూజలు చేశారు. రెండ్రోజుల పాటు భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా డీఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ రాఘవరెడ్డి తెలిపారు.

గెరిగెలతో మొక్కులు ప్రత్యేకం

ఈ జాతరలో బెల్లం పానకం, పసుపునీరు, మజ్జిగ కుండల్లో నింపుకొని గెరిగెలు నెత్తిన పెట్టుకొని భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. స్త్రీలు, పురుషులు గంగవేషాలు వేసుకుని పురవీధుల్లో గెరిగెలతో పాదమండపం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. జంతు బలులు ఇస్తారు.

కోడ్ ఉల్లంఘించిన ఇద్దరు క్షేత్రసహాయకుల సస్పెన్షన్

కల్లూరు, ఏప్రిల్ 1: పులిచెర్ల మండలంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఇద్దరు ఉపాధి క్షేత్రసహాయకులను డ్వామా పీడీ సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో సురేష్ బాబు సోమవారం తెలిపారు. గతనెల 17వ తేదీన మండల వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో అయ్యావాండ్లపల్లి పంచాయతీ క్షేత్రసహాయకుడు మురళి, దిగువపోకలవారిపల్లి పంచాయతీ క్షేత్రసహాయకుడు ప్రసాద్ పాల్గొనడంతో స్థానిక టీడీపీ నాయకులు బండ్ల కిరణ్, మల్లెల సురేష్ సీ-విజిల్‌కి, ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించగా ఇద్దరు క్షేత్రసహాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లు ఆధారాలతో రుజువు కావడంతో సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

2కిలోల గంజాయి స్వాధీనం
స్మగ్లర్ అరెస్టు

చిత్తూరు, ఏప్రిల్ 1: రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఓ స్మగ్లర్‌ని ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ విశ్వనాథరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తరచూ పోలీసులు ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల తనిఖీ చేస్తున్నారు. సోమవారం కూడా దొడ్డిపల్లె వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా.. జార్ఖండ్‌రాష్ట్రం ధన్‌బాగ్ జిల్లాకు చెందిన క్రిష్ణసాబ్ అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకుని విచారించగా, గంజాయి స్మగ్లర్ అని తేలింది. అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇతను గంజాయిని ఎవరి వద్ద తీసుకుంటున్నాడు.. ఎవరెవరికి విక్రయిస్తున్నాడన్న దానిపై విచారిస్తున్నామని సీఐ తెలిపారు.

తమ్ముడి మరణం తట్టుకోలేక అక్క హఠాన్మరణం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 1: తమ్ముడి మరణాన్ని తట్టుకోలేక అక్క హఠాన్మరణం చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రంగస్థల నటుడు, రిటైర్డు మున్సిపల్ ఉద్యోగి అయిన సుందరకేశవులు (84) చిత్తూరులోని డీఐ రోడ్డులో నివాసముంటున్నారు. నాయుడు బిల్డింగ్‌లో అక్క సుశీల (87) ఉంటున్నారు. రోజూ ఇద్దరూ మాట్లాడుకుంటూ, ఆరోగ్యంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సుందరకేశవులుకు సోమవారం గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సుశీల వెంటనే వచ్చి మృతదేహాన్ని చూసి, ఇంటికి తిరిగొచ్చారు. తమ్ముడి మరణాన్ని తట్టుకోలేక తల్లడిల్లారు. అనంతరం తలనొప్పిగా ఉందని కుటుంబీకులకు చెప్పారు. అలసటగా ఉందేమోనని కుమారుడు గోపీకృష్ణ ఆమెకు జ్యూస్‌ను ఇవ్వగా తాగి పడుకున్నారు. కొంతసేపటికి నిద్రలోనే కన్నుమూశారు. దాంతో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇద్దరి మృతదేహాలకు మంగళవారం దహన సంస్కారాలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



సుందరకేశవులు - సుశీల (ఫైల్‌ఫొటోలు)

భార్యతో సహజీవనం చేస్తున్నాడనే చంపేశాడు

హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న పోలీసులు



హరికృష్ణ (ఫైల్ ఫొటో)

కల్లూరు, ఏప్రిల్ 1: తన భార్యతో సహజీవనం చేస్తున్నాడని ఓ వ్యక్తిని ఆమె భర్త చంపేశాడు. ఈ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. సీఐ, ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన జయానందపాల్ అలియాస్ హరికృష్ణ (45).. కర్నూలు టౌన్ ఇందిరమ్మ కాలనీలో స్థిరపడ్డాడు. భార్యతో గొడవపడి విడాకులు తీసుకున్నాక తిరుమలకు వచ్చి ఓ హోటల్‌లో కూలీపనికి చేరాడు. మరోవైపు పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి పంచాయతీ గోపాలపురం ఎస్టీకాలనీకి చెందిన చంద్రయ్య భార్య రాణి తన భర్తతో గొడవపడి, విడిపోయి తిరుమలకు వచ్చి హరికృష్ణ పనిచేసే హోటల్‌లోనే కూలీపనికి చేరింది. ఈ క్రమంలో హరికృష్ణ, రాణి మధ్య ఏర్పడిన పరిచయం సహజీవనానికి దారితీసింది. కొన్నాళ్ల తర్వాత చంద్రయ్య కూడా తిరుమలకు వచ్చి భార్య పనిచేస్తున్న హోటల్‌లోనే పనికి చేరాడు. అప్పటికే హరికృష్ణ, రాణి సహజీవనం చేస్తుండటాన్ని చూసి చంద్రయ్య తట్టుకోలేక పోయాడు. ఎలాగైనా హరికృష్ణ అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీంతో మార్చి 26వ తేదీన తన భార్యను ఒప్పించి హరికృష్ణను మంగాపురం తీసుకొచ్చాడు. రాణిని మంగాపురంలో ఉండమని చెప్పి హరికృష్ణను తీసుకుని పీలేరుకు వచ్చాడు. అక్కడ ఇద్దరూ కలిసి మద్యం తాగారు. అక్కడ హత్య చేసేందుకు కుదరకపోవడంతో కల్లూరుకు వచ్చారు. అక్కడా మద్యం తాగి పులిచెర్ల మండలం కల్లూరు నుంచి పులిచెర్ల రోడ్డులోని వ్యవసాయ పొలం వద్దకు చేరుకున్నారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న హరికృష్ణ తల కుడి భాగంలోని కణతపై బండరాళ్లతో చంద్రయ్య బలంగా కొట్టి చంపేసి, పరారయ్యాడు. మార్చి 29వ తేదీన స్థానికుల సమాచారంతో కల్లూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వీఆర్వో ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో నిందితుడు చంద్రయ్య సోమవారం ఎల్లంకివారిపల్లి వీఆర్వో రాజశేఖర్‌నాయక్ వద్దకు వెళ్లి నేరాన్ని ఒప్పుకున్నాడు. వీఆర్వో కల్లూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితుడు అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

వలంటీర్ల నుంచి సిమ్‌కార్డులు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకోండి
కలెక్టర్ షన్మోహన్



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 1: ఎన్నికల కమిషన్ సూచనల మేరకు సామాజిక పెన్షన్లను సిబ్బంది ద్వారా పంపిణీ చేయాలని, వలంటీర్ల సేవలను వినియోగించరాదని ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ అన్నారు. సోమవారం ఎన్నికల ఏర్పాట్లు, పెన్షన్ల పంపిణీ, తాగునీటి సరఫరా అంశాలపై జేసీ శ్రీనివాసులుతో కలిసి జిల్లా అధికారులు, కమిషనర్లు, ఆర్వోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కలెక్టరేట్‌లో సమీక్షించారు. ప్రభుత్వం ద్వారా వలంటీర్లకు పంపిణీ చేసిన సిమ్‌కార్డులు, సెల్‌ఫోన్లు, బయోమెట్రిక్ డివైజ్‌లను ఎంపీడీవోలు వెనక్కి తీసుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందించాలన్నారు. పలమనేరు, పుంగనూరు, కుప్పం ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉందని, నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. వారంలోగా తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి నివేదికలు ఇవ్వాలని ఆదేశాలిచ్చారు. పీడీలు రాజశేఖర్, తులసి, రాధమ్మ, డీపీవో లక్ష్మి, డీఎల్‌డీవో రవికుమార్, తదితర అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్లు, ర్యాంపులు ఏర్పాటు చేయాలి

విభిన్న ప్రతిభావంతులు వందశాతం ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, వీల్‌చైర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్యతో కలిసి నోడల్ ఆఫీసర్లతో సమీక్షించారు. పోలింగ్ కేంద్రం లొకేషన్, బీఎల్‌వోలు, వీఆర్వోల ఫోన్ నెంబర్లు సమీపాన నమోదు చేయాలని చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమాధికారి శ్రీనివాస్, డీటీసీ నిరంజన్‌రెడ్డి, ఆర్డీవో సునీల్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహులు పాల్గొన్నారు.

కిలో టమోటా రూ.23.40

పుంగనూరు, ఏప్రిల్ 1: పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం కిలో టమోటా ధర రూ.23.40 పలికింది. కొద్దిరోజులుగా ఎండలు పెరగడం, బోర్లలో నీరుతగ్గడం వల్ల పంట దిగుబడి తగ్గుతోంది. మంగళ, బుధవారాల్లో పుంగనూరు గంగజాతర తదితర కారణాల వల్ల కిలో టమోటా రూ.16 నుంచి పెరగడం, తగ్గడం జరుగుతోంది. ఆదివారం కిలో రూ.17.40 ఉన్న ధర సోమవారం నాణ్యతగల మొదటిరకం టమోటా కిలో రూ.23.40, రెండోరకం కిలో రూ.17.40, మూడోరకం కిలో రూ.11.40తో రైతుల నుంచి 38.14 మెట్రిక్ టన్నుల టమోటాను వ్యాపారులు కొనుగోలు చేసి డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం) : సా. 6.30
సహరి (బుధవారం) : ఉ. 4.47

ఎండీయూల ద్వారానే రేషన్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 1: ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ ప్రారంభం అయ్యిందని, గత మూడు నెలలుగా పంపిణీ పర్యవేక్షణ విధులు నిర్వహిస్తున్న వలంటీర్లు ఇకపై పాల్గొనరాదని జేసీ శ్రీనివాసులు తెలిపారు. వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, బయోమెట్రిక్ డివైజులు తమ సమీపంలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు అందజేయాలన్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు.

పింఛన్ల పంపిణీలో ఆలస్యంపై సత్యవేడు ఎమ్మెల్యే మౌనదీక్ష



టీడీపీ నేతలతో కలిసి మౌనదీక్ష చేస్తున్న ఆదిమూలం

నారాయణవనం, ఏప్రిల్ 1 : సామాజిక పెన్షన్ల పంపిణీలో ఆలస్యంపై నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం మౌన దీక్ష చేపట్టారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కూడా అయిన ఆదిమూలం నారాయణవనంలో పార్టీ నేతలతో కలిసి సాయంత్రం గంట సేపు దీక్ష చేపట్టారు.నగదు లోటు కారణంగానే పెన్షన్లు పంపిణీ చేయలేదని, అయితే జగన్, వైసీపీ నాయకులు కావాలనే టీడీపీ పైన బురదచల్లే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.సచివాలయ సిబ్బంది ద్వారా వెంటనే ఫించన్లను లబ్ధిదారుల ఇళ్లకు చేర్చాలని ఆదిమూలం డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు ఆర్డీ ఏకాంబరం, భాస్కరన్, గోవిందస్వామి, శివకుమార్, కేఎస్ రవి, గోవిందశెట్టి, రమేష్, సురేష్, విజయ్‌కుమార్, జయచంద్ర నాయుడు, కందస్వామి నాయుడు, వాసు, మల్లికార్జున రెడ్డి, మాణిక్యం రెడ్డి, రవిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆ టీచర్లను విధుల్లోకి తీసుకోండి : ఎస్టీయూ



డీఈవోతో చర్చిస్తున్న ఎస్టీయూ సంఘం నేతలు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 1: ఓపెన్ స్కూల్ పరీక్షల విధి నిర్వహణలో సస్పెండైన టీచర్లను విధుల్లోకి తీసుకోవాలని ఎస్టీయూ నాయకులు డీఈవో దేవరాజు, ఏడీ విజయేంద్రరావులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం డీఈవోను ఆయన చాంబర్‌లో ఎస్టీయూ నాయకులు కలిశారు. వారు మాట్లాడుతూ.. గత ఏడాది జవాబు పత్రాల మూల్యాంకనం రెమ్యునరేషన్ బకాయిలు చెల్లించాలని, అనారోగ్య, అనివార్య సమస్యలతో స్పాట్‌కు రాలేని టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. అనంతరం డీఈవో, ఏడీలు ఎస్టీయూ సమాచార స్రవంతి ప్రతులను ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర నేత గంటా మోహన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, మోహన్, యువరాజు, నాయకులు దేవరాజులు, చంద్రన్, ప్రభుకుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

15మంది వలంటీర్ల రాజీనామా

కల్లూరు/భైరెడ్డిపల్లె, ఏప్రిల్ 1: పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి సచివాలయం పరిధిలోని 10 మంది వలంటీర్లు సోమవారం రాజీనా మా చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. ఈ రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు పంపనున్నట్లు పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు.

- భైరెడ్డిపల్లె మండలంలోని గౌనితిమ్మేపల్లెకు చెందిన ఐదుగురు వలంటీర్లు సోమవారం ఎంపీడీవోకు రాజీనామాపత్రాన్ని అందజేశారు.

కాళంగినదిలో పడి యువకుడి మృతి

తడ, ఏప్రిల్ 1: స్నేహితులతో కలసి నదిలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు నీట మునిగి మృతి చెందాడు. తిరుపతి జిల్లా తడ మండల పరిధిలోని గ్రద్దగుంట దళితవాడకు చెందిన కుప్పంపాటి వెంకయ్య(28) శుక్రవారం మధ్యాహ్న సమయంలో నలుగురు మత్స్యకారులతో కలసి కాళంగినది వద్దకు వెళ్లాడు.అందరూ కలసి మద్యం సేవించి భోంచేశారు. స్నేహితులు నదిలో వలలు కట్టుకునే పనిలో ఉండగా వెంకయ్య నదిలోకి దిగి నీట మునిగిపోయాడు. స్నేహితులు అది గమనించకుండా వెళ్లిపోయారు. ఆదివారం సాయంత్రం కుటుంబసభ్యులు వెంకయ్య కోసం గాలిస్తుండగా తమతో పాటు వచ్చాడని, ఆ తరువాత కనబడలేదని స్నేహితులు చెప్పారు. దీంతో అందరూ కలసి నదివద్దకు వెళ్లి చూడగా మృతదేహం తేలుతూ కనిపించింది.వెంకయ్య మృతిపై అనుమానాలు ఉన్నట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్ శివప్రసాద్ ఆదాయ వనరులపై ఐటీ దృష్టి

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 1 : రేణిగుంట మాజీ తహసీల్దార్ శివప్రసాద్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని అవినీతి నిరోధక శాఖ తనిఖీల్లో బయటపడడంతో ఆదాయ పన్ను శాఖ దృష్టి సారించింది. పన్నుల చెల్లింపునకు సంబంధించి వివరాలు ఆరా తీస్తోంది. తిరుపతి, పీలేరులో ఆయన కూడబెట్టిన ఆస్తులు, భార్య డాక్టర్ కావడంతో ఆమె ఆదాయ వనరులపైనా దృష్టి సారించింది. అధికారిక లెక్కల ప్రకారం రూ.100కు 30 శాతం ఆదాయ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇలా దాదాపు రూ.70 కోట్లకు రూ.21 కోట్లు ఆదాయ పన్ను చెల్లించాల్సి ఉంది. ఆ మేరకు చెల్లింపులు జరిగాయా లేదా అనేది చూస్తున్నారు.

తప్పిన పెనుప్రమాదం

- రెండో ఘాట్‌లో అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు
- చెట్టును ఢీకొని ఆగడంతో బయటపడిన ప్రయాణికులు



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

తిరుమల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్ రోడ్డులో సోమవారం పెనుప్రమాదం తప్పింది. ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పింది. చెట్టు ను ఢీకొనడంతో లోయలోకి దూసుకుపోకుండా ప్రమాదం తప్పింది. విజిలెన్స్ అధికారులు వివరాల మేరకు.. ఏపీ 03 జెడ్ 5617 నెంబరు గల ఆర్టీసీ బస్సు 15 ప్రయాణికులతో సోమవారం మధ్యాహ్నం తిరుపతి నుంచి తిరుమలకు బయలుదేరింది. హరిణి ప్రాంతానికి సమీపంలో ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయే క్రమంలో అదుపుతప్పి ఎడమవైపు పిట్టగోడను బలంగా ఢీకొంది. గోడ పగిలిపోవడంతో ముందుకు దూసుకు వెళ్లి చెట్టును ఢీకొని ఆగిపోయింది. బస్సులోని ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. చెట్టు లేకుంటే లోయలోకి దూసుకుపోయి పెద్ద ప్రమాదం జరిగేది. విషయం తెలుసుకున్న పోలీసులు, విజిలెన్స్ అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని విచారణ మొదలుపెట్టారు. ప్రమాద నేపథ్యంలో కొంతసేపు వాహనాలు నిలిచిపోయాయి. బస్సును పక్కకు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు.

రైలు కిందపడి టీచర్ మృతి



కృష్ణప్రసాద్ (ఫైల్ ఫొటో)

గూడూరు, ఏప్రిల్ 1: రైలు దిగుతుండగా కాలుజారి పడి ఓ ఉపాధ్యాయుడు మృతిచెందిన ఘటన తిరుపతి జిల్లా గూడూరు రైల్వేస్టేషన్‌లో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే జీఆర్ పోలీసుల కథనం మేరకు... నెల్లూరులోని హరినాథపురంలో నివాసం వుంటున్న కృష్ణప్రసాద్(42) గూడూరు మండలం వెందోడు ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. రోజూ నెల్లూరు నుంచి పాఠశాలకు వచ్చి వెళ్తుంటారు. సోమవారం నెల్లూరు నుంచి బిట్రగుంట - చెన్నై మెమో రైలు లో గూడూరు వచ్చారు. మూడో నంబరు ప్లాట్‌ఫాంపై ఆగేందుకు రైలు నెమ్మదిగా వెళ్తుండగా కృష్ణప్రసాద్ కిందకు దిగబోయాడు. ఆ సమయంలో కాలుజారి రైలు కింద పడడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రైల్వే జీఆర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

పింఛన్ల పంపిణీపై వైసీపీ దుష్ప్రచారం

మాజీ మంత్రి అమరనాథరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 1: సామాజిక పింఛన్ల పంపిణీపై వైసీపీ దుష్ప్రచారాన్ని మానుకోవాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి సూచించారు. సోమవారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వలంటీర్లు లేకపోతే పింఛన్లు ఇవ్వలేమన్న విధంగా సీఎం జగన్ చెబుతున్నారన్నారు. ఎన్నికల కోడ్ వచ్చాక వలంటీర్లను ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయరనేది అందరికీ తెలుసన్నారు. అందువల్ల ఎన్నికలప్పుడు ఏవిధంగా పింఛన్లు పంపిణీ చేయాలన్న దానిపై కార్యాచరణ చేసుకోకుండా ప్రతిపక్షంపై విమర్శలు చేసే దౌర్భాగ్య పరిస్థితికి జగన్ దిగజారారంటేనే ఓటమిపై ఆయనకు ఎంత భయం పట్టుకుందో అర్థం చేసుకోవచ్చన్నారు. గతంలో సచివాలయ సిబ్బంది లేనప్పుడు కూడా పింఛన్ల పంపిణీ పారదర్శకంగా జరిగిందని గుర్తుచేశారు. ఇపుడు సచివాలయాలతోపాటు ఎంపీడీవో, రెవెన్యూ కార్యాలయాల్లోనూ సిబ్బంది ఉన్నారని, వాళ్ల ద్వారా పింఛన్లు ఇచ్చే ప్రయత్నం చేయకుండా.. ఈ అంశాన్ని కూడా రాజకీయంచేసే నీచపు ఆలోచన వైసీపీ ప్రభుత్వం చేస్తోందని మండిపడ్డారు. 'అసలు పింఛన్ల పంపిణీకి అవసరమైన డబ్బులు మీ వద్ద ఉన్నాయా.. కాంట్రాక్టర్లకు పేమెంట్లు ఇచ్చేసి.. ఈ రకంగా రాజకీయం చేస్తున్నారా' అని అమర్ ప్రశ్నించారు. ఇక వారి సొంత పత్రికలో.. మార్చి కాబట్టి మూడ్రోజులు పెన్షన్ల పంపిణీ ఆలస్యం అవుతుందని ప్రచురించారు.. సోషల్ మీడియాలో మాత్రం ప్రతిపక్షాలపై నెపం వేస్తున్నారని దుయ్యబట్టారు. ఇకనైనా పేదలకు, వృద్ధులకు ఇబ్బంది లేకుండా వెంటనే పింఛన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఆర్వీ బాలాజి, ఆర్బీసీ కుట్టి, గిరిబాబు, నాగరాజు, ఖాజీపీర్, మదన్‌మోహన్, శ్రీధర్, అస్లాం, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరణిని గెలిపించి తిరుపతిని బాబుకు కానుకగా ఇస్తాం

- టీడీపీ ఇన్‌ఛార్జి సుగుణమ్మ ప్రకటన - కుటుంబ సభ్యులు, పార్టీ నేతలతో కలిసిన ఆరణి



ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు పసుపు కండువాను కప్పుతున్న సుగుణమ్మ

తిరుపతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : "చంద్రబాబు సీఎం కావడమే మా లక్ష్యం. సీఎంగా అసెంబ్లీకి వస్తానని ఆయన శపథం చేశారు. ఆ శపథం నెరవేరేలా పనిచేస్తాం. ఆయన ఆదేశాలకు అనుగుణంగా తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును గెలిపించి చంద్రబాబుకు తిరుపతిని కానుకగా ఇస్తాం." అని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ప్రకటించారు. సోమవారం జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు (జేఎంసీ) తన కుటుంబ సభ్యులు, జనసేన పార్టీ నాయకులతో కలిసి టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ నివాసానికి వెళ్లారు. దాదాపు అరగంటకు పైగా రెండు కుటుంబాలు ఏకాంతంగా మాట్లాడుకున్నాయి. అనంతరం మీడియాతో సుగుణమ్మ మాట్లాడారు. జనసేన- టీడీపీ- బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ టీడీపీలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు సద్దుమణిగాయని చెప్పారు. జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలను, నాయకులను కుటుంబ సభ్యులుగా చూసుకుంటానని తెలియజేశారు. గత ఐదేళ్లుగా తిరుపతిలో సుగుణమ్మ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేశారని, వైసీపీ ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి, వైసీపీ అభ్యర్థి అభినయ్ రెడ్డి తిరుపతి ప్రజలను వేధించారన్నారు. వైసీపీ నేతలు తిరుపతిని లూటీ చేశారని, టీడీఆర్ బాండ్లలో నిజమైన బాధితులకు న్యాయం చేస్తామన్నారు.తిరుపతిలో గంజాయి అమ్మకాలను అరికడతామని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టీడీపీ నాయకులు భట్టే వెంకట కీర్తి, చిట్టిబాబు, దంపూరి భాస్కర్, బుల్లెట్ రమణ, కృష్ణ యాదవ్, కంకణాల రజనీకాంత్ నాయుడు, రుద్రకోటి సదాశివం, బ్యాంకు శాంతమ్మ, ఆముదాల తులసీరాం, కొట్టే హేమంత్ రాయల్, ఆర్సీ శ్రీనివాస్, మునిరామయ్య, గోళ్ల లోకేశ్ నాయుడు, విశ్వనాథం, కరాటే చంద్ర తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంతో సుగుణమ్మ దాదాపుగా అలక వీడారని భావిస్తున్నారు.చంద్రబాబు రేణిగుంటలో తిరుపతి నేతలతో మాట్లాడిన తర్వాత వీరు చల్లబడ్డారని తెలుస్తోంది.

పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 1: యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ దఫా ఏపీపీజీసెట్-2024 నిర్వహణ బాధ్యతను విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి ప్రభుత్వం అప్పగించింది. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ తదితర కోర్సులు రాష్ట్రంలోని పలు వర్సిటీలు నిర్వహిస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. సోమవారం నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించారు. సెట్స్.ఏపీసీహెచ్ఈ.ఏపీ.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా మే 4వ తేదీలోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రూ.500 రుసుంతో మే 15 వరకూ, రూ.1000తో మే 25వ తేదీదాకా గడువు ఉంది. జూన్ 10 నుంచి ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు.

నాక్ సభ్యురాలిగా నారాయణమ్మ

యూజీసీ నాక్ పీర్ టీంలో సభ్యురాలిగా పద్మావతీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణమ్మ నియమితులయ్యారు. ఉన్నత విద్యా సంస్థల్లోని నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి నాక్ గ్రేడింగ్ ప్రకటించే ప్రక్రియలో ఈమె భాగస్వామ్యం వహిస్తారు. టీటీడీ విద్యా సంస్థలకు సంబంధించి నాక్ పీర్ టీంకు ఎన్నికైన మొదటి వ్యక్తి ఆమే కావడం గమనార్హం. కామర్స్ అధ్యాపకురాలైన నారాయణమ్మ హాస్టల్ వార్డెన్‌గా, ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ప్రభుత్వం నుంచి ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్నారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ వి.కృష్ణవేణి, పలువురు అధ్యాపకులు ఆమెను అభినందించారు.

సిలబస్ మార్పు చేర్పులపై రేపు సమావేశం

నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) - 2020 ప్రకారం సిలబస్‌లో మార్పు చేర్పులపై ఈనెల 3వ తేదీన తిరుపతిలో సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈ సమావేశం చేపట్టనున్నారు. తొమ్మిది సైన్స్, నాలుగు ఆర్ట్స్ కోర్సులకు సంబంధించిన సిలబస్ రూపకల్పన బాధ్యతను ఉన్నత విద్యా మండలి ఈ దఫా పద్మావతి వర్సిటీ, యోగి వేమన వర్సిటీలకు అప్పగించింది. ఇరు వర్సిటీల అధికారులు, బీఓఎస్ చైర్మన్లు, అకడమిక్ వ్యవహారాల అధికారులు ఈ సమావేశంలో పాల్గొంటారు. మార్పు చేర్పులపై ఉన్నత విద్యా మండలికి నివేదించనున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.35 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.4.35 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 81,224 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,093 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీవారి ఆలయంలో మొదలైన రుగ్వేద పారాయణం

తిరుమల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో సోమవారం రుగ్వేద పారాయణం మొదలైంది. ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 12 మంది నిష్ణాతులైన వేదపండితులు పాల్గొని పారాయణం చేశారు. లోకకల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ 2020 ఏప్రిల్ 11వ తేదీ నుంచి టీటీడీ చతుర్వేద పారాయణం ప్రారంభించింది. మొత్తం నాలుగు వేదాల్లోని ఐదు శాఖలు పారాయణం చేశారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 10 గంటల వరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. చతుర్వేద పారాయణం వల్ల అనంతమైన ఫలితం సిద్ధిస్తుందని ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థ ప్రాజెక్ట్ అధికారి ఆకెళ్ల విభీషణ శర్మ తెలిపారు.

ఎస్వీయూలో మతి స్థిమితం లేని యువతి సంచారం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 1: ఎస్వీ యూనివర్సిటీలో మతి స్థిమితం లేని యువతి సంచరిస్తోంది. 30 ఏళ్లలోపు వయస్సు కలిగిన తమిళనాడుకు చెందిన ఆ యువతి వారం రోజులుగా వర్సిటీలో తనలో తాను ఏదో మాట్లాడుకుంటూ, భుజంపై దుస్తులు వేసుకుని అన్నపూర్ణ క్యాంటీన్, శ్రీనివాసా ఆడిటోరియం కేంద్రాల వద్ద సంచరిస్తోంది. ఈమెను ఎవరైనా చేరదీసి, వివరాలు రాబట్టి ఇంటికి చేర్చడమో, ఆసరా కల్పించడమో, ఆరోగ్యాన్ని బాగు చేయించడమో చేస్తే మంచిదని వర్సిటీ వర్గాలు సూచిస్తున్నాయి.

పక్కా లోకల్...!

- ప్రశ్నార్థకంగా రక్షకభటుల బదిలీలు
- అధికారులకే పరిమితమైన ఎన్నికల కోడ్
- దశాబ్దాలుగా సొంత ప్రాంతాల్లో సిబ్బంది తిష్ట
- ఎన్నికల సమయంలో ప్రభావితం చేసే అవకాశం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1 : పోలీసు శాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది చాలా చోట్ల దశాబ్దాలుగా ఒకే చోట పాతుకుపోయారు.వారిలో కొందరు రాజకీయ పార్టీలకు దాసోహం అయిపోయారు. ఎస్ఐ పైస్థాయి అధికారులు మాత్రమే కాలపరిమితి ముగిసిన తర్వాత బదిలీ అవుతున్నారు.హోంగార్డు నుంచి ఏఎస్ఐ వరకూ నిబంధనల ప్రకారం బదిలీ కావడం లేదు. ఎన్నికల కోడ్ సమయంలో తప్పనిసరిగా మూడేళ్ల కాల పరిమితి నిండిన అధికారులను బదిలీతో జిల్లా దాటిస్తుంటారు. క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రం చాలామంది సంవత్సరాల తరబడి సొంతప్రాంతాల్లో రకరకాల కారణాలతో కొనసాగుతుం డడంపై ప్రతిపక్ష పార్టీల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

శాంతిభద్రతల పరిరక్షణలో రక్షకభటుల పాత్ర ఎంత కీలకమైనదో అందరికీ తెలిసిందే. ప్రధానంగా ఎన్నికల సమయాల్లో నిష్పక్షపాతంగా భద్రతా వ్యవస్థ వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ఉద్దేశంతోనే ఎస్ఐ స్థాయి నుంచి అధికారులకు తరచూ స్థానచలనం కల్పిస్తుంటారు. ఇక ఎన్నికల కోడ్ సమయంలో అధికారుల బదిలీలు తప్పనిసరిగా జరిగి తీరుతుంటాయి. అయితే పోలీసు శాఖలో కిందిస్థాయి సిబ్బంది చాలామంది ఎక్కడివారు అక్కడే రాజకీయ బలంతో పాతుకుపోయారు. వాస్తవానికి సొంత మండలంలో, సబ్ డివిజన్ పరిధిలో ఒక కానిస్టేబుల్‌కు ఎప్పుడూ విధులు కేటాయించకూడదు. కానీ జిల్లావ్యాప్తంగా చాలామంది కానిస్టేబుళ్లు సొంత మండలాల్లోనే దశాబ్దాలుగా గడిపేస్తున్నారు. ఒకే సబ్ డివిజన్ పరిధిలో ఇలా 28 ఏళ్లుగా పనిచేస్తున్న వారు కూడా ఉండడం గమనార్హం. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఒకే డివిజన్‌లో పోలీస్ స్టేషన్లు మారుతూ రింగ్ మాస్టర్లుగా అక్కడే తిరుగుతున్నారు. శ్రీకాళహస్తిలో అలాగే చాలామంది రిటైరయ్యారు కూడా. ఇదిలా ఉండగా కొందరు వేరే సబ్ డివిజన్‌కు బదిలీ అయిన తర్వాత కూడా ఎస్పీ స్థాయి అధికారి ఇచ్చే అటాచ్మెంట్(డిప్యుటేషన్)తో వారికి కావాల్సిన స్థానాల్లో కొలువుదీరిపోయారు. తిరుపతి జిల్లాలో ఇలాంటి వారు 40శాతం దాకా వున్నారని సమాచారం. ఒక శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలో సుమారు 50మంది దశాబ్దాలుగా సొంత స్థావరం లోనే అటూ ఇటూ తిరుగుతున్నారు. సొంత స్థావరాల్లో క్షేత్రస్థాయి రక్షకభటులు వేళ్లూనుకుపోవడంతో అధికారులకు తలనొప్పులు తప్పడం లేదు. బయట ప్రాంతం నుంచి వచ్చిన అధికారులు స్టేషన్లో పాతుకు పోయిన సిబ్బందిని గట్టిగా ఆదేశించి విధులు కేటాయించలేకపోతున్నారు.పలు సందర్భాల్లో అధికారుల పైనే స్థానిక బలంతో సిబ్బంది తిరగబడిన ఘటనలున్నాయి. శాంతిభద్రతల సమస్యలు ఎదురైనా, అలాగే ఫిర్యాదులు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సమయాల్లోనూ క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం చూపుతున్నారు. పోలీసులు స్థానికులు కావడంతో గట్టిగా ఆకతాయిలను కూడా మందలించలేకపోతున్నారు. అన్నీ తెలిసినా నాన్ లోకల్ భయంతో అధికారులు ఏమీ చేయలేక పోతున్నట్లు తరచూ వాపోతుంటారు.

ఇటీవల శ్రీకాళహస్తిలోని ఒక స్టేషన్లో జరిగిన ఘటన అందరినీ విస్మయానికి గురి చేసింది. ఒక సీఐ తమ శాఖ ఉన్నతాధికారి ముక్కంటి ఆలయానికి వచ్చిన సమాచారం తనకు ఎందుకు చెప్పలేదని కానిస్టేబుల్‌ను ప్రశ్నించాడు. దీంతో ఆ కానిస్టేబుల్ పోలీస్ స్టేషన్లో సిబ్బంది చూస్తుండగానే సీఐకి దురుసుగా సమాధానం ఇచ్చాడు. దాంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.అంత జరిగినా ఆ అధికారి ఎవరికీ చెప్పుకోలేక లోలోపల మధనపడుతూనే తరువాత బదిలీపై వెళ్లిపోయాడు. ఇక వివాదాలు, ఆరోపణలు ఎదుర్కొన్న ఎందరో సిబ్బంది తమ రాజకీయ బలంతో ఏడాది కూడా తిరగకముందే తిరిగి అదే స్టేషన్లో పోస్టింగ్ పొందుతున్నారు. ఇక ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయిలో పోలీసు సిబ్బంది తీవ్ర ప్రభావితం చేసే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.

ఇటీవల పోలీస్ స్టేషన్లో కొత్త అధికారులు కొలువుదీరారు.వారు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్న ఉద్దేశంతో ఏ నిర్ణయం తీసుకున్నా క్షణాల్లో అధికార పార్టీ నాయకులకు చేరిపోతోంది. అన్ని పోలీస్ స్టేషన్లలో స్థానికులుండడం అధికార పార్టీకి వరంగా మారింది. ఒకే చోట ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న వారికి బలమైన పరిచయాలు ఏర్పడ్డాయి. అదే ప్రాంతాల్లో రేపు పోలింగ్ బూత్‌ల వద్ద క్షేత్రస్థాయి విధులు కేటాయించాల్సి ఉంటుంది. దాంతో ఒకే చోట పుట్టి, పెరిగి, విధులు నిర్వహించిన సిబ్బంది చాలా సులభంగా ప్రజలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. అలాగే రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరించేందుకు కూడా వారికి చాలా అవకాశం ఉంది.క్షేత్రస్థాయి పరిస్థితులను లోతుగా పరిశీలించి జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ చిరకాలంగా పాతుకుపోయిన రక్షకభటులను బదిలీ చేసే ప్రక్రియను ఉన్నతాధికారులు చేపట్టాల్సివుంది.

పెన్షన్ డబ్బును కాంట్రాక్టర్లకు బదలాయించిన సీఎం జగన్

- టీడీపీ నేతలు



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 1: సామాజిక పెన్షన్ డబ్బును సీఎం జగన్ తమకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు బదలాయించారని టీడీపీ నేతలు ఆరోపించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ మీడియాతో మాట్లాడుతూ.. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛను సొమ్ము ఇవ్వకుండా.. తనకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు బదిలీచేసి ఖజానా ఖాళీ అయిందని సీఎం జగన్ రెడ్డి సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించడం వల్ల ఖజానా ఖాళీ అయిందని.. తిరిగి డబ్బులు సమకూర్చడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ మాట్లాడుతూ.. వలంటీర్లద్వారా కాకుండా ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పెన్షన్లు పంపిణీ చేయాలని ఈసీ ఆదేశించిందని గుర్తించాలని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు, రైతులు అప్పుల ఊబినుంచి బయటపడాలన్నా, మహిళలకు ఆర్థిక స్వావలంబన కలగాలన్నా టీడీపీ అధికారంలోకి రావాలని చెప్పారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను గెలిపించాలని కోరారు. నేతలు శశికర్ బాబు, శ్రీనివాస్, త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య



ప్రేమ్‌కుమార్ (ఫైల్ ఫొటో)

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 1: ప్రేమ విఫలమై ఓ సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం అనుపల్లె గ్రామ పంచాయతీ ఉప్పిలివంకకు చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు ప్రేమ్‌కుమార్ (27) ఏఎంపురం గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఎస్ఆర్‌పురంలోనే ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ స్థానికంగా ఓ మహిళ ప్రేమలో పడ్డాడు. ఆమె పెళ్లికి అంగీకరించక పోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. అద్దె ఇంట్లోనే ఆదివారం రాత్రి కమ్మీకి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు సమాచారంతో సోమవారం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు ఎస్ఆర్‌పురానికి చేరుకుని బోరున విలపించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కుళాయప్ప తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉప్పిలివంకలో విషాదఛాయలు

రామచంద్రాపురం, ఏప్రిల్ 1: ప్రేమ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. వారు ఉప్పిలివంకకు తీసుకురావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మట్టి అక్రమ రవాణా

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



చింతమండి వద్ద ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిపోతున్న మట్టి

కార్వేటినగరం, ఏప్రిల్ 1: కార్వేటినగరం మండలం చింతమండి వద్ద గుట్ట నుంచి మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పుత్తూరు - చిత్తూరు జాతీయ రహదారిపై మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ గుట్టలోని మట్టిని కొంతమంది అక్రమ రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో మండల రెవెన్యూ అధికారులు బిజీగా ఉండటంతో ప్రభుత్వ భూముల్లోని మట్టిని అక్రమార్కులు యథేచ్ఛగా దోచేస్తున్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కందూరులో గంగజాతర వేడుకలు



సోమల, ఏప్రిల్1: కందూరులో గంగ జాతరను పురస్కరించుకుని ఆదివారం రాత్రి నడివీధిలో అమ్మ వారిని ఊరేగింపుగా తీసుకొని వచ్చి ప్రతిష్ఠించారు. అమ్మవారి మండపం వద్దకు మహిళలు బోనాలు, దీలు ప్రదర్శనగా తీసుకొచ్చారు. ఆసాది వారు రాత్రి జాగరణ చేస్తూ భక్తులకు అమ్మవారి చరిత్రను వివరించారు. మహిళలు పొలిమేర అమ్మవార్ల ఆలయాల వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం ఉదయం నడివీధి గంగమ్మకు బలిపోతును బలిదానం చేసి బలిహరణాన్ని తోటి తలారులు పంట పొలాల్లో చల్లి పంటలు సుభిక్షంగా పండాలని మొక్కుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కందూరు పంచాయతీ పరిధిలోని పగడాలవారి పల్లె, బాలప్పగారిపల్లె, మిట్టపల్లె, ఊటుపల్లె తదితర గ్రామాల్లో జాతర వేడుకలు జరుపుకొన్నారు.

రొంపిచెర్లలో టీడీపీ బైక్ ర్యాలీ



రొంపిచెర్ల, ఏప్రిల్ 1: రొంపిచెర్ల మండలంలో సోమవారం పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. రొంపిచెర్ల క్రాస్‌లో ఆయన జండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. అక్కడి నుంచి గానుగచింత పంచాయతీ చల్లంపల్లె వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. రొంపిచెర్ల, మోటుమల్లెల, గానుగచింత తదితర పంచాయతీల్లో మహిళలు కర్పూర హారతులతో ఘన స్వాగతం పలికారు. ర్యాలీలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, చల్లా అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపిస్తే 20 లక్షల ఉద్యోగాల భర్తీ



సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుయువత నేతలు

రామకుప్పం, ఏప్రిల్ 1: రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తుందని తెలుగు యువత రామకుప్పం మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం తెలిపారు. సోమవారం రామకుప్పం పంచాయతీ తెలుగుయువత సమావేశంలో వారు మాట్లాడుతూ ఏటా జాబ్‌కేలండర్ అమలు చేస్తానని, పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు కల్పిస్తానని గద్దెనెక్కి, వైసీపీ పాలకులు అధికారంలోకి రాగానే వాటిని విస్మరించారన్నారు. యువతీయువకులు తమ విద్యార్హతకు తగ్గ ఉద్యోగాలు దక్కకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారన్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు కరవై యువత పొరుగు రాష్ట్రాల పట్టణాలకు వలస వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు ఇచ్చిన ప్రతి హామీని తప్పక అమలు చేస్తుందన్నారు. సమావేశంలో నేతలు వెంకటరమణ, ఆదిల్, అవినాశ్, మంజునాథ్, సాగర్‌రెడ్డి, మురళీ, చలపతి, చాన్‌బాషా, బ్రహ్మానందం పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన పందిళ్లపల్లె సర్పంచ్, వార్డు సభ్యులు



చౌడేపల్లె, రొంపిచర్ల: ఏప్రిల్1: పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రా రెడ్డి సమక్షంలో పందిళ్లపల్లె సర్పంచ్ కదిరప్పతోపాటు వార్డు సభ్యులు పార్టీలో చేరారు. సోమవారం రొంపిచర్లలో ఆయన నివాసం వద్ద పందిళ్లపల్లె సర్పంచ్‌తోపాటు వైస్ సర్పంచ్ గణేష్, వార్డు సభ్యులు వైసీపీ నుంచి ముకుమ్మడిగా చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతికార్యకర్త సైనికుడిలా పనిచేసి టీడీపీని గెలిపించుకుందా మన్నారు. కార్యక్రమంలో ప్రదీప్‌రాజు, లక్ష్మీపతిరాజు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపుకోసం సైనికుల్లా పనిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కిశోర్‌గౌడు

బైరెడ్డిపల్లె,ఏప్రిల్1: వచ్చే ఎన్నికల్లో టీడీపీని అఖండ మెజారిటీతో గెలిపించడానికి పార్టీశ్రేణులు సైనికుల్లా పనిచేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు పిలుపునిచ్చారు. బైరెడ్డిపల్లెలోని ఓ కల్యాణ మండపంలో సోమవారం టీడీపీ బీసీసెల్ క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర్‌గౌడు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల సంక్షేమం కోసం అమలు చేయనున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం బీసీలను విస్మరించి వారికి అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో టీడీపీ ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, బీసీసెల్ నాయకులు నాగభూషణం, గోవిందస్వామి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరగా కటింగ్ చేయలేదని క్షరకుడిపై దాడి

బార్బర్ షాపు ధ్వంసం

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 1: త్వరగా కటింగ్ చేయకుండా నిర్లక్ష్యం చేశాడని పుంగనూరులో ఓ క్షరకుడిని, అడ్డువచ్చిన అతడి తండ్రిపై దాడి చేయడమే కాకుండా బార్బర్ షాపును ధ్వంసం చేసిన ఘటన పుంగనూరులో సోమవారం వెలుగు చూసింది. పోలీసులకు బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. పుంగనూరులోని హనుమంతురాయదిన్నె వద్ద మహేశ్ అనే యువకుడు బార్బర్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం అదే ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు శివ తన పిల్లలకు కటింగ్ చేయాలని వెళ్లగా ముందువచ్చిన వారు చాలా మంది ఉన్నారు కొంత ఆలస్యం అవుతుంది తర్వాత రావాలని సూచించాడు. మా పిల్లలకే కటింగ్ చేయవా అంటూ మద్యం మత్తులో మహేశ్‌పై దాడి చేస్తుండగా అడ్డుకోవడానికి వచ్చిన అతడి తండ్రి అంజప్పను కూడా కొట్టి రక్తగాయాలు చేశాడు. అలాగే బార్బర్ షాపుపై రాళ్లు, కర్రలతో దాడి చేసి ధ్వంసం చేసి దుర్భాషలాడిన శివపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని నాయీబ్రాహ్మణ సంఘ నాయకులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

4న పుంగనూరుకు మాజీ సీఎం కిరణ్ రాక

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 1: మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట లోక్‌సభ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఈనెల నాలుగోతేది పుంగనూరుకు వస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకుడు అయూబ్‌ఖాన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నాలుగో తేది సాయంత్రం స్థానిక దండుపాళ్యం రోడ్డులోని నారాయణస్కూల్ గ్రౌండ్‌లో నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహిస్తారని చెప్పారు.

నేడు టీడీపీ బీసీ నేతల సమావేశం

శాంతిపురం, ఏప్రిల్ 1 : స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం మండల టీడీపీ బీసీ నేతల సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల బీసీ సెల్ అధ్యక్షుడు చలపతి తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని టీడీపీ బీసీ నేతలు హాజరు కావాలని ఆయన కోరారు.

అసత్య ప్రచారాలతో టీడీపీ విజయాన్ని అడ్డుకోలేరు

టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్

కుప్పం, ఏప్రిల్ 1: అసత్య ప్రచారాలతో టీడీపీ విజయాన్ని అడ్డుకోలేరని ఆ పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతిపురం మండలం సి.బండపల్లె ఎంపీటీసీ నామాలప్పపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు పునరావృతమైతే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పింఛన్లు అందించిందే ఎన్టీయార్ అని, సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీ ప్రారంభించినవేనన్నారు. ఆ మాట మరచి పదేపదే సంక్షేమానికి తానే కేరాఫ్ అడ్రెస్‌గా జగన్‌రెడ్డి చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. బడుగు బలహీన వర్గాలతోపాటు ముస్లిం మైనారిటీల సంక్షేమం గురించి పట్టించుకున్న ఏకైక పార్టీ టీడీపీయేనన్నారు. టీడీపీ ఎలక్షన్ కమిషన్‌కే చేసిన ఫిర్యాదు వల్లనే పింఛన్లు ఆగాయని వైసీపీ చేస్తున్న ప్రచారం పచ్చి అబద్ధమన్నారు. ఎన్నికల నియమావళిని అనుసరించి ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. వలంటీర్లు కాకపోతే వందలకొద్దీ ఉన్న సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికి పింఛన్లు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆ బాధ్యతను మరచి అబద్ధాలు పలికితే నమ్మేవారు ఎవరూ లేరని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, వన్నెకుల క్షత్రియ టీడీపీ రాష్ట్ర సాధికార సమితి అధ్యక్షుడు జీఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజన్

దాడులకు పాల్పడితే ఊరుకునేది లేదు

ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం

కుప్పం, ఏప్రిల్ 1: టీడీపీ నేతలు, కార్యకర్తలపై వైసీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు దాడులకు పాల్పడితే ఊరుకునేది లేదని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం అన్నారు. శాంతిపురం మండలంలో ఎంపీటీసీ నామాలప్ప, కుప్పం మండలం దాసేగౌనూరులో గ్రామస్తులపై జరిగిన దాడులను వారు తీవ్రంగా ఖండించారు. ఎన్ని దాడులకు తెగబడినా, ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో ఎన్డీయే కూటమి విజయం ఖాయమని స్పష్టం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక కుప్పంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని నిలదీస్తున్న మహిళలపై కూడా ఆ పార్టీ నాయకులు అసభ్య పదజాలంతో విరుచుకుపడుతున్నారని, ఇది వారి సంస్కారాన్ని తెలియజెబుతుందన్నారు. 2019కి ముందు కుప్పంలో లేని గంజాయి ఆనవాళ్లు రామకుప్పంలో బయటపడుతున్నాయని, అది కూడా వైజాగ్‌నుంచి వచ్చినట్లు తేలుతోందని ఆరోపించారు. వైసీపీ నేతలు ఎన్నిపాట్లు పడినా కుప్పంలో లక్ష ఓట్ల మెజారిటీతో చంద్రబాబు ఘన విజయం ఖాయమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ కుప్పం మున్సిపల్ ఇన్‌ఛార్జి రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ సాంబశివం, జనసేన, బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు నరేశ్, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

పెన్షన్లు ఇవ్వడం చేతకాక టీడీపీపై బురద చల్లడం సరికాదు

మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, ఏప్రిల్ 1 : పేదలకు పెన్షన్లు ఇవ్వడం చేతకాక టీడీపీపై బురద చల్లడం సరికాదని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్‌నాయుడు, మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల పార్టీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ వలంటీర్లను పక్కన పెట్టి పెన్షనర్లకు పింఛన్లు పంపిణీ చేయాలని ఎలక్షన్ కమిషన్ చెబితే దానికి టీడీపీనే పింఛన్లు ఇవ్వకుండా అడ్డుపడుతోందని వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మరన్నారు. రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి పింఛన్లు ఇవ్వడం చేతకాక ఇలాంటి డ్రామాలు ఆడడం వైసీపీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్లు ఇప్పిస్తే కేవలం గంటల వ్యవధిలోనే పూర్తి చేయవచ్చన్నారు. వారు ఎన్ని కుట్రలు చేసినా టీడీపీ గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ప్రధాన కార్యదర్శి పీవీ నాగరాజు, రాళ్ళబూదుగూరు యూనిట్ ఇన్‌చార్జి ఆర్ఎస్ మణి, కుప్పం నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు రాజేంద్ర, టీడీపీ నేతలు గోపాల్, జయపాల్, వినోద్‌కుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

● ఏఆర్వో, కమిషనర్ అరుణ

చిత్తూరు, ఏప్రిల్ 1: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నగరపాలక సంస్థ పరిధిలోని 150 పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఏఆర్వో, కమిషనర్ అరుణ చెప్పారు. సోమవారం ఆమె విలేకరుతో మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపు సౌకర్యాలు కల్పించామని, విద్యుదీకరణ, మరుగుదొడ్లు, నీటి సరఫరా, ఫర్నీచర్ వంటి సౌకర్యాలు పూర్తి చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఆ బూత్‌కు సంబంధించిన అధికారుల పేర్లు, ఫోన్ నెంబర్లను రాయించామన్నారు. నగర పరిధిలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేస్తున్నట్లు వివరించారు. నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు భవనాలపై రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, వాల్ పోస్టర్లు తదితర వాటిని తొలగించామన్నారు. ఎంసీసీపై అందిన ఫిర్యాదులపై సత్వరం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సీ-విజిల్ యాప్ ద్వారా ఇప్పటి వరకు అందిన 26 ఫిర్యాదులను ఎంసీసీ బృందాలు పరిశీలించి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నగరంలో ఎంసీసీ, ఎఫ్ఎస్టీ, వీఎస్టీ బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున నగర ప్రజలు ఏమి చేయాలో.. ఏమి చేయకూడదో అవగాహన పెంచుకోవాలన్నారు.

తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు

● కమిషనర్ అరుణ

చిత్తూరు, ఏప్రిల్ 1: వేసవి నేపథ్యంలో నగరంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ అరుణ చెప్పారు. నగరపాలక పరిధిలో 50 వార్డుల్లో 39 వార్డులకు కల్వకుంట జలాశయం నుంచి నీరు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. జలాశయంలో ప్రస్తుతం 2100ఎంఎల్డీల నీరు ఉందని, మరో మూడు నెలల వరకు నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. మిగిలిన 11 వార్డుల్లో బోర్లు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోందన్నారు. నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో అధనంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామన్నారు. నగరంలో మొత్తం 463 బోర్లకుగాను 457 బోర్లు ప్రస్తుతం రన్నింగ్‌లో ఉన్నాయని, మరో ఏడు బోర్లకు మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పారు. ఏ ప్రాంతంలో అయినా తాగునీటి సమస్య ఉత్పన్నతమైతే వెంటనే 9849907885కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

సామాజిక శాస్త్రాలు చరిత్రకు పట్టుకొమ్మలు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 1: సామాజిక శాస్త్రాలు చరిత్రకు పట్టుకొమ్మలాంటివని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి పేర్కొన్నారు. చరిత్ర, రాజనీతిశాస్త్రం అంశాలపై అధ్యాపకులకు ఐదు రోజుల శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సామాజిక శాస్త్రాలు సమాజాభివృద్ధిలో ముందుంటాయన్నారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహ కల్పించి, వారిలో దేశభక్తిని పెంచాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. చరిత్ర, రాజనీతిశాస్త్రాలు అందుకు ఎంతగానో దోహదపడుతామని, వీటిని విశ్లేషణాత్మక పద్ధతిలో విద్యార్థులకు వివరించాలని సూచించారు. తరగతుల్లో రాజనీతిశాస్త్ర అధ్యాపకులు ఉమాదేవి సమన్వయకర్తగా వ్యవహరించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

3 నుంచి వార్డు సచివాలయాల్లో పెన్షన్ల పంపిణీ

చిత్తూరు, ఏప్రిల్ 1: నగరపాలక సంస్థ పరిధిలో సామాజిక పెన్షన్ల పంపిణీకి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని, పెన్షన్ లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నగర కమిషనర్ అరుణ చెప్పారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి సంబంధిత వార్డు సచివాలయాల్లో వార్డు కార్యదర్శుల ద్వారా సామాజిక పెన్షన్ల పంపిణీ జరుగుతుందన్నారు. నగరపాలక పరిధిలో మొత్తం 16,697 పెన్షన్లకు సంబంధించి వార్డు సచివాలయం పరిధిలో క్లస్టర్లవారీగా కార్యదర్శులను కేటాయించామన్నారు. లబ్ధిదారులంతా నిర్దేశించిన సమయంలో వార్డు సచివాలయానికి వచ్చి పెన్షన్లను తీసుకోవాలన్నారు. నడవలేని వారికి, బెడ్ రీడన్ పేషెంట్లకు ప్రభుత్వ నిబంధనల మేరకు పెన్షన్లను అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమలో సీఎంఎం గోపి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

ఐరాల, ఏప్రిల్ 1: మండలంలోని బీరప్పచెరువులోని ఎంపీయూపీ పాఠశాలలో సోమవారం పలువురు విద్యార్థులకు బహుమతులను అందించారు. పాఠశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి 60బహుమతులను రూ.6,000 ఖర్చుతో దాతలు మన్యం శివ, వెంకటేష్, సాయిరామ్, రవిరెడ్డి గ్రామానికి చెందిన యువత తరఫున బహుమతులు అందించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ విద్యార్థులు ఐక్యమత్యంగా ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థి చక్కగా చదువుకుని పరీక్షలు చక్కగా రాయాలన్నారు. ఆటలలో బాగా రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం

నింద్ర, ఏప్రిల్ 1: బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ నింద్ర మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం నింద్రలో జయహో బీసీ కార్యక్రమం జరిగింది. టీడీపీ బీసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలను నా బీసీలు, నా ఎస్సీలు అంటూనే సీఎం జగన్ నిలువునా ముంచారని విమర్శించారు. 50 సంవత్సరాలకే బీసీలకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టి నెలకు రూ.4 వేలు ఇవ్వనున్నట్లు టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించినట్లు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడమే కాకుండా రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకున్న జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని టీడీపీ గెలుపుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి విజయ్‌కుమార్, బీసీ నాయకులు క్రిష్టయ్య, గిరి, బాబుయాదవ్, సంపూర్ణమ్మ, వెంకటేశులు రెడ్డి, రఘుయాదవ్, తోజేష్, భాస్కర్, మనోజ్‌యాదవ్, మణిరెడ్డి, ప్రసాద్, పెరుమాల్‌రెడ్డి, చిట్టిబాబు, రవికుమార్, పరదేశి, జగన్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయానికి రూ.2లక్షల విరాళం

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 1: స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి సోమవారం రూ.2,00,000 విరాళం లభించింది. వరసిద్ధుడి ఆలయ అభివృద్ధికి కడపకు చెందిన శంకర్‌రాజు రూ.50,116, గో సంరక్షణ ట్రస్టుకు రూ.50,116 విరాళాన్ని చెక్కు రూపంలో అందించారు. అలాగే తిరుపతికి చెందిన శ్యామ్‌కుమార్ గో సంరక్షణ ట్రస్టుకు రూ.1,01,116 విరాళంగా అందించారు. విరాళ దాతలను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం వారిని వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం సంస్థానరాజుల చరిత్ర పుస్తకావిష్కరణ

కార్వేటినగరం, ఏప్రిల్ 1: కార్వేటినగరం సంస్థాన రాజుల చరిత్ర పుస్తకాన్ని రచయిత కె. నీలకంఠారెడ్డి కార్వేటినగరంలో సోమవారం ఆవిష్కరించారు. సంస్థాన రాజుల గురించి గత 40 ఏళ్లుగా ఎంతో శ్రమకోర్చి అన్వేషించి ఈ పుస్తకాన్ని ఆయన అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చారు. సోమశిల ప్రాజెక్టు రిటైర్డ్ ఇంజనీర్‌గా పనిచేసిన నీలకంఠారెడ్డి గతంలో కార్వేటినగరం జాతర పుస్తకాన్ని కూడా రచించారు. సాహిత్యాభిలాష రచయిత అయిన నీలకంఠారెడ్డి కార్వేటినగరం సంస్థాన జానపద కళలు, రాజుల చరిత్ర పట్ల ఎంతో మక్కువతో విషయ సేకరణ చేశారని ఈ సమావేశంలో పాల్గొన్న ఆరికట్ల సుబ్రమణ్యం తెలిపారు. పుస్తక రచయితను పలువురు ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

నగరి బార్ కౌన్సిల్ నూతన కార్యవర్గం ఎంపిక

నగరి, ఏప్రిల్ 1: నగరి జూనియర్ సివిల్ జడ్జి జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టులో నూతన బార్ కౌన్సిల్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ కౌన్సిల్ అధ్యక్షుడిగా ఎం.జె. జగదీష్, ఉపాధ్యక్షుడిగా ఈ.జీ. బాబు, కార్యదర్శిగా రావూరి పురుషోత్తం, ఉపకార్యదర్శిగా అరుణ్, కోశాధికారిగా నాగరాజన్‌లు ఎంపికయ్యారు. జడ్జి విష్ణువర్మ నూతన బార్ అసోసియేషన్‌ను అభినందిస్తూ ప్రశాంత వాతావరణంలో కోర్టు నడవడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మురళీధర్, ఉదయభాను, చిరంజీవులుశెట్టి, మహదేవన్, మణివాసగం, తిరుమలయ్య, త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

7న జాతీయస్థాయి పురస్కారాలు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 1: తెలుగుసాహితీ సమితి ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన పలమనేరు కళామందిరంలో జాతీయస్థాయి ఉగాది పురస్కారాల సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు తులసీనాథం నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి దేశవ్యాప్తంగా తెలుగు భాషాభిమానులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

చిత్తూరులో రూ.18.57 కోట్ల పన్ను వసూలు

చిత్తూరు, ఏప్రిల్ 1: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.18.57 కోట్ల పన్నులను వసూలు చేశారు. రూ.22.70 కోట్ల డిమాండ్‌కు గాను ఈ ఏడాది 80శాతం పన్నులు వసూలు సాధించామని కమిషనర్ అరుణ తెలిపారు. గతేడాది పాత బకాయిలను కలిపి రూ.27.72 కోట్లు వసూలు చేయడంతో ఈ ఏడాది డిమాండ్ బాగా తగ్గింది. గతేడాది రూ.35కోట్ల డిమాండ్ ఉండగా, ఈ ఏడాది రూ.22.70కి తగ్గింది. కమిషనర్ అరుణ ఆధ్వర్యంలో రెవెన్యూ యంత్రాంగం మూడు నెలలుగా ప్రత్యేక దృష్టి సారించడంతో వసూళ్లవేగం పెరిగింది. ఆఖరు రోజైన ఆదివారం ఒక్క రోజే రికార్డు స్థాయిలో రూ.1.53 కోట్ల పన్ను వసూలైంది.

నేటినుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

కుప్పం, ఏప్రిల్ 1: కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో పాలిసెట్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2వ తేదీనుంచి 26వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఇవ్వడమేకాక, మెటీరియల్ కూడా ఉచితంగానే పంపిణీ చేస్తామన్నారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. శిక్షణానంతరం పాలిసెట్-2024 నమూనా పరీక్ష న్విహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9542423396 అనే నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

టీడీపీలో చేరిన ఫైనాన్షియర్



పలమనేరు, ఏప్రిల్1 : పలమనేరుకు చెందిన ఫైనాన్స్ వ్యాపారి భాస్కర్‌యాదవ్ సోమవారం మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన ఆయనకు టీడీపీ కండువాలు వేసి అమరనాథరెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్బీ సీకుట్టి, ఆర్‌వి బాలాజి, గిరిబాబు, నాగరాజు, ఖాజా, చాంద్‌బాషా, అఫ్రోజ్, మదన్‌మోహన్, సుబ్బు, కృష్ణ, బీర్సీ కుమార్, పెద్దపంజాణి నాయకులు మురహరిరెడ్డి, బాబాజాన్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాను బోల్తా : డ్రైవర్‌కు గాయాలు



కల్లూరు, ఏప్రిల్1: కల్లూరు నాలుగురోడ్ల కూడలిలో సోమవారం వేకువజామున డివైడర్‌ను ఢీకొని కోళ్ల వ్యాను బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు గాయాలు కాగా సుమారు 500 కోళ్ల మృతిచెందాయి. డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం... పుంగనూరు నుంచి సూళ్లూరుపేటకు బంగారుపాళెంకు చెందిన డ్రైవర్ శశి కోళ్ల లోడుతో వెళుతూ కల్లూరులో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో వ్యాను బోల్తా పడింది. దీంతో సుమారు 500 కోళ్ల మృతి చెందగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. డ్రైవర్‌ను చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వ్యాను రోడ్డుపై అడ్డంగా పడటంతో క్రేన్ సహాయంతో తొలగించారు.

కనికల చెరువు వద్ద ఏనుగుల మకాం

సోమల, ఏప్రిల్ 1: సోమల మండలం అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీల్లోని పొలాల్లో ఏనుగుల సంచారంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి పేటూరు పంచాయతీలోని కనికల చెరువు వద్ద మకాం వేసిన ఏనుగులు ఆ ప్రాంతంలోని మామిడి తోటలు, టమోటా, వరి పొలాల్లో సంచరించి తొక్కివేశాయి. ఇర్లపల్లెవాసులు ఏనుగుల దాడులకు భయపడి ఇళ్ల వద్ద అగ్ని మంటలు వేసుకుని డప్పులు వాయించారు.

సదుంలో ట్రాఫిక్ మళ్లింపు

సదుం,ఏప్రిల్1: 'సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా మంగళవారం రాత్రి నదుం-సోమల ప్రధాన రహదారిలోని అమ్మగారిపల్లె వద్ద రాత్రి సీఎం జగన్ బస ఉన్నట్లు ఎస్‌ఐ మారుతి తెలిపారు. దీంతో మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు కల్లూరు నుంచి మండల పరిధిలోకి వచ్చే వాహనాలను వయా బూరగమంద, చీకలచేను, నంజంపేట మీదుగా దారి మళ్లించారు.

నేడు జగన్ రాకతో ట్రాఫిక్ ఆంక్షలు

సోమల, ఏప్రిల్ 1: సీఎం జగన్ సిద్ధం బస్సు యాత్ర మంగళవారం మధ్యాహ్నం 3గంటల నుంచి పుంగనూరు మార్గం నుంచి సోమల మీదుగా సదుంకు ఉండడంతో బస్సులు వెళ్లే మార్గాల్లో మార్పు చేసినట్లు ఎస్‌ఐ వెంకట నరసింహులు తెలిపారు. పుంగనూరు నుంచి తిరుపతికి వెళ్లే వాహనాలు సోమల నుంచి కందూరు - కలికిరి వైపు మళ్లించినట్లు తెలిపారు. సదుం నుంచి కందూరు, చింతలవారిపల్లె, మేటిమంద మీదుగా పుంగనూరుకు వెళ్లే విధంగా ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

ఎల్లమ్మ ఆలయం ప్రారంభం



సదుం,ఏప్రిల్1: తాటిగుంటపాళెం పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లెలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయాన్ని సోమవారం ప్రారంభించారు. వరుసగా మూడు రోజులపాటు జరిగే వేడుకల్లో భాగంగా సోమవారం గ్రామోత్సవం, గణపతి పూజ, హోమాలు నిర్వహించారు.

నీటి శుద్ధి యంత్రం సిద్ధం

సోమల, ఏప్రిల్ 1: సోమల పట్టణం స్వయంభేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం నీటి శుద్ధి యంత్రం మరమ్మతులు పనులు చేపట్టారు. పది రోజులుగా నీటిశుద్ధి యంత్రం పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను ఆదివారం ఆంధ్రజ్యోతిలో మరమ్మతుకు నోచుకోని నీటిశుద్ధి యంత్రం అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై వైస్ ఎంపీపీ ప్రభాకర్, సర్పంచు రాజేశ్వరి, కార్యదర్శి సుధాకర్ స్పందించి మరమ్మతు చేయించారు.

బీసీవై నాయకుల ప్రచారం

సోమల, ఏప్రిల్ 1: మండలంలోని చిన్నఉప్పరపల్లెలో బీసీవై నాయకులు సోమవారం ప్రచారం జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరకు రైతు గుర్తుకు ఓటు వేసి రామచంద్ర యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ప్రతి మండలంలో డెయిరీ ఏర్పాటు చేసి పాడి రైతులను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో సురేంద్ర యాదవ్, దాదిం, మణి, వేణు, నాగార్జున, గురు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నలగుండ్రాయస్వామి ఉత్సవాలు



బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 1 : కడపనత్తం గ్రామంలో వున్న నలగుండ్రాయ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శయనోత్సవంతో ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా అర్చకులు అలివేలు మంగ, పద్మావతీ సమేత నలగుండ్రాయ స్వామి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వరసిద్ధుడి ఆలయానికి రూ.2లక్షల విరాళం



దాత శ్యామ్‌కుమార్‌కు విరాళమిచ్చిన పత్రాన్ని అందిస్తున్న సూపరింటెండెంట్ కోదండపాణి, చెక్కును అందిస్తున్న దాత శంకర్‌రాజు

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 1: స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి సోమవారం రూ.2,00,000 విరాళం లభించింది. వరసిద్ధుడి ఆలయ అభివృద్ధికి కడపకు చెందిన శంకర్‌రాజు రూ.50,116, గో సంరక్షణ ట్రస్టుకు రూ.50,116 విరాళాన్ని చెక్కు రూపంలో అందించారు. అలాగే తిరుపతికి చెందిన శ్యామ్‌కుమార్ గో సంరక్షణ ట్రస్టుకు రూ.1,01,116 విరాళంగా అందించారు. విరాళ దాతలను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం వారిని వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్య నిషేధంపై మాట తప్పిన సీఎం



ప్రభుత్వ మద్యం దుకాణాల ఫొటోలు చూపుతున్న వరుణ్ కుమార్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 1: మద్య నిషేధంపై సీఎం జగన్ మాటతప్పారని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్ కుమార్ విమర్శించారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్య నిషేధం చేసిన తర్వాతే మళ్లీ ఓట్లు అడుగుతామని చెప్పిన జగన్ రెడ్డి ఇప్పుడు ఏముఖం పెట్టుకుని మళ్లీ ఓట్ల కోసం వస్తున్నారని ప్రశ్నించారు. వైసీపీ మద్యం దుకాణాలను మూసివేస్తారా లేక ఓట్లు అడగడం మానేస్తారా అని అన్నారు. మద్యం సేవించే వారి ఆరోగ్యాలను పణంగా పెట్టి వైసీపీ ప్రభుత్వం రూ.25 వేల కోట్లు అప్పు తెచ్చిందని చెప్పారు. అనంతరం నగరంలోని మద్యం దుకాణాల ఫొటోలను ప్రదర్శించారు. జనసేన పార్టీ నగర ఉపాధ్యక్షుడు ఆరిఫ్ మాట్లాడుతూ మద్యపాన నిషేధం చేస్తానంటూ ప్రజలను మోసం చేసిన వైసీపీని ఓడించి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నింద్ర, ఏప్రిల్ 1: బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ నింద్ర మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం నింద్రలో జయహో బీసీ కార్యక్రమం జరిగింది. టీడీపీ బీసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలను నా బీసీలు, నా ఎస్సీలు అంటూనే సీఎం జగన్ నిలువునా ముంచారని విమర్శించారు. 50 సంవత్సరాలకే బీసీలకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టి నెలకు రూ.4 వేలు ఇవ్వనున్నట్లు టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించినట్లు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడమే కాకుండా రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకున్న జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకోని టీడీపీ గెలుపుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి విజయ్‌కుమార్, బీసీ నాయకులు క్రిష్టయ్య, గిరి, బాబుయాదవ్, సంపూర్ణమ్మ, వెంకటేశులు రెడ్డి, రఘుయాదవ్, తేజేష్, భాస్కర్, మనోజ్‌యాదవ్, మణిరెడ్డి, ప్రసాద్, పెరుమాల్‌రెడ్డి, చిట్టిబాబు, రవికుమార్, పరదేశి, జగన్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపిస్తే పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల విద్యుత్ ఉచితం: భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 1: టీడీపీని సమష్టిగా కలిసి మెలసి గెలిపించండి.. పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి పట్టణ పరిధిలోని చింతలపట్టెడలో సోమవారం సాయంత్రం బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ కరపత్రాలను పంచుతూ రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను గురించి వివరించారు. బీసీలకు, ఎస్సీ ఎస్టీ, మైనారిటీ, మహిళలు, రైతులు ఇలా అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మదివాసన్, పొన్నప్పన్, కె.జి.భూపతి, అయ్యప్ప, గణేష్, వెంకటేష్, నారాయణస్వామి, సాయి, వేలాయుధం, పట్టణ ప్రధాన కార్యదర్శి ఈ ఎన్ శ్రీనివాసన్, వీకేఎస్‌వాసు, గుణశేఖర్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నిధులు లేకే పింఛన్ల పంపిణీ నిలిపివేత: టీడీపీ

పెనుమూరు, ఏప్రిల్ 1: ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైసీపీ చీప్ ట్రిక్స్ ప్లే చేస్తోందని మాజీ ఎంపీపీ హరిబాబు నాయుడు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వాస్తవానికి ప్రభుత్వం దగ్గర పింఛన్లు ఇవ్వడానికి డబ్బులు లేవని, కొత్తగా అప్పులు దొరకకపోవడంతో పింఛన్ల పంపిణీని వాయిదా వేసిందని ఆయన ఆరోపించారు. వారి అసమర్థతను టీడీపీపై నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. అధికారపార్టీ నియమించుకున్న వలంటీర్లను ఎన్నికల సమయంలో పక్కన పెట్టాలని ఎన్నికల కమిషన్ ఆదేశిస్తే వైసీపీకి ప్రజలపై నిజంగా ప్రేమ ఉంటే సచివాలయ ఉద్యోగుల చేత ఇంటింటికీ ఎందుకు పంపిణీ చేయలేదో జగన్ చెప్పాలన్నారు. వలంటీర్లు లేకపోతే ప్రజలను గాలికి వదిలేస్తారా... 3వ తేదీ మాత్రం పింఛన్లు ఎలా పంపిణీ చేస్తారు... ఆ పని 1వ తేదీనే ఎందుకు చేయలేకపోయారో జగన్ వివరణ ఇవ్వాలని ఆయన కోరారు.

తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు: కమిషనర్

చిత్తూరు, ఏప్రిల్ 1: వేసవి నేపథ్యంలో నగరంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ అరుణ చెప్పారు. నగరపాలక పరిధిలో 50 వార్డుల్లో 39 వార్డులకు కల్వకుంట జలాశయం నుంచి నీరు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. జలాశయంలో ప్రస్తుతం 2100ఎంఎల్డీల నీరు ఉందని, మరో మూడు నెలల వరకు నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. మిగిలిన 11 వార్డుల్లో బోర్లు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోందన్నారు. నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో అదనంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామన్నారు. నగరంలో మొత్తం 463 బోర్లకుగాను 457 బోర్లు ప్రస్తుతం రన్నింగ్‌లో ఉన్నాయని, మరో ఏడు బోర్లకు మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పారు. ఏ ప్రాంతంలోనైనా తాగునీటి సమస్య ఉత్పన్నతమైతే వెంటనే 9849907885కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

సామాజిక శాస్త్రాలు చరిత్రకు పట్టుగొమ్మలు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 1: సామాజిక శాస్త్రాలు చరిత్రకు పట్టుగొమ్మల్లాంటివని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి పేర్కొన్నారు. చరిత్ర, రాజనీతిశాస్త్రం అంశాలపై అధ్యాపకులకు ఐదు రోజుల శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సామాజిక శాస్త్రాలు సమాజాభివృద్ధిలో ముందుంటాయన్నారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహ కల్పించి, వారిలో దేశభక్తిని పెంచాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. చరిత్ర, రాజనీతిశాస్త్రాలు అందుకు ఎంతగానో దోహదపడుతాయని, వీటిని విశ్లేషణాత్మక పద్ధతిలో విద్యార్థులకు వివరించాలని సూచించారు. తరగతుల్లో రాజనీతిశాస్త్ర అధ్యాపకులు ఉమాదేవి సమన్వయకర్తగా వ్యవహరించారు. అధ్యాపకులు జయచంద్రుడు, మీరాసాహెబ్, రెడ్డిభాషా, బాబు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జీవనజ్యోతి

11 కేవీ విద్యుత్ లైన్ తీగలు మాయం



తీగలు మాయమైన విద్యుత్ స్తంభాలు

కార్వేటినగరం, ఏప్రిల్ 1: కార్వేటినగరం మండలం గోపిశెట్టిపల్లి దళితవాడ సమీపంలోని పొలాల్లో ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ అల్యూమినియం తీగలు మాయమయ్యాయి. విద్యుత్ తీగలు గల్లంతైన సంఘటన వెనుక ట్రాన్స్‌కో సిబ్బంది హస్తం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ పొలాల్లో ఉన్న ఐదు విద్యుత్ స్తంభాల పొడువునా ఉన్న విద్యుత్ తీగలు ప్రస్తుతం కనపడటంలేదు. ఇందుకు బాధ్యులైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

శిలాఫలకానికి ముసుగు



శిలాఫలకంపై ముసుగు వేసిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 1: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా ఎస్ఆర్ పురం మండలం గంగమ్మగుడి గ్రామంలో అరిమాని గంగమ్మ దేవస్థానంలోని శిలాఫలకంపై ఉన్న సీఎం బొమ్మకు ముసుగు వేయలేదని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం శిలాఫలకానికి ముసుగు వేశారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న కిచ్చెన్నగారిపల్లె, పాలకూరు గ్రామస్తులు

పూతలపట్టు, ఏప్రిల్ 1: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లో కిచ్చెన్నగారిపల్లె, పాలకూరు గ్రామస్తులు భోజన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు యువరాజులు నాయుడు, ప్రతాపనేని చంద్రమౌళి, కార్తికేయ చౌదరి, రాజశేఖర్ నాయుడు, రెడ్డప్ప నాయుడు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: స్థానిక అన్నక్యాంటీన్‌లో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో ముట్టుకూరుపల్లెకు చెందిన సాంబశివ నాయుడు, పవన్‌ల ఆధ్వర్యంలో నిరుపేదలకు సోమవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండ మల్లీశ్వరుడికి పాలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కొండ మల్లీశ్వరస్వామి, ఆవుదేవర నందీశ్వరస్వామి

వెదురుకుప్పం, ఏప్రిల్ 1: డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞానప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ప్రత్యేక పూజాది కార్యక్రమాలతో పాటు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అన్నమయ్య, శివ సంకీర్తనలను ఆలపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అలాగే చవటగుంటలోని ఆవుదేవర నందీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన వసతి కల్పించారు.

పశువులపై పిచ్చికుక్క వీరంగం



కుక్క కరిచిందని దూడను చూపుతున్న పాడిరైతు

వెదురుకుప్పం, ఏప్రిల్ 1: వెదురుకుప్పం మండలం మాంబేడు, మాంబేడు కాలనీల్లో సోమవారం పిచ్చి కుక్క పశువులపై దాడి చేసింది. ఈ దాడిలో 18 పశువులను కరిచిందని పాడి రైతులు తెలిపారు. దీంతో పాడి రైతులు భయాందోళన చెందుతున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

చిత్తూరు, ఏప్రిల్ 1: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నగరపాలక సంస్థ పరిధిలోని 150 పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఏఆర్వో కమిషనర్ అరుణ చెప్పారు. సోమవారం ఆమె విలేకరుతో మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపు సౌకర్యాలు కల్పించామని, విద్యుదీకరణ, మరుగుదొడ్లు, నీటి సరఫరా, ఫర్నీచర్ వంటి సౌకర్యాలు పూర్తి చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఆ బూత్‌కు సంబంధించిన అధికారుల పేర్లు, ఫోన్ నెంబర్లను రాయించామన్నారు. ఎంసీసీపై అందిన ఫిర్యాదులపై సత్వరం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సీ-విజిల్ యాప్ ద్వారా ఇప్పటి వరకు అందిన 26 ఫిర్యాదులను ఎంసీసీ బృందాలు పరిశీలించి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీ అధికారులు గోపాలకృష్ణవర్మ, గోపి తదితరులు పాల్గొన్నారు.

7న జాతీయస్థాయి పురస్కారాలు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 1: తెలుగుసాహితీ సమితి ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన పలమనేరు కళామందిరంలో జాతీయస్థాయి ఉగాది పురస్కారాల సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు తులసీనాథం నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి దేశవ్యాప్తంగా తెలుగు భాషాభిమానులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణంతో వాహనాల దారి మళ్లింపు

పెనుమూరు, ఏప్రిల్ 1: పెనుమూరు క్రాస్ నుంచి పెనుమూరు వరకు నూతన తారు రోడ్డు పనులు గత వారం రోజులుగా చేస్తున్నారు. అయితే మంగళవారం ఉగ్రాణంపల్లి వద్ద సిమెంటు రోడ్డు పనులు చేపడుతున్న నేపథ్యంలో వాహనాలు వెళ్లేందుకు వీలు కాదని.. ఇందుకు ఆర్టీసీ, ఆర్ అండ్ బీ అధికారుల అనుమతి, సహకారంతో పెనుమూరు నుంచి చిత్తూరుకు వెళ్లే వాహనాలను వేరొక దారిలో మళ్లించినట్లు రోడ్డు నిర్మాణ పర్యవేక్షకులు లోకేశ్‌రెడ్డి తెలిపారు. పెనుమూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెనుమూరు నుంచి కొత్తరోడ్డు గొడుగుమానుపల్లి, పులకల్లు మీదుగా చిత్తూరుకు వెళ్లాలని, అదే విధంగా మరో రూట్ బండకిందపల్లి, అడవిపల్లి, మఠంపల్లి మీదుగా వెళ్లాలని సూచించారు. ఈ విషయాన్ని ప్రజలు, వాహనదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా: గురజాల



గురజాల జగన్మోహన్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

గుడిపాల, ఏప్రిల్ 1: ఈసారి ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదిస్తే అన్ని విధాల అభివృద్ధి చేస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని నారగల్లు నుంచి మండల టీడీపీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు చెప్పిన సూపర్‌సిక్స్ పథకాల లబ్ధి అందేలా చేస్తామన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు సీకేబాబు, ఏఎస్ మనోహర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో అరాచకాలు, దౌర్జన్యాలు, భూ కబ్జాలు చేస్తూ నిరుపేదలను అణగదొక్కే విధంగా వ్యవహరించారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం నారగల్లుకు చెందిన మాజీ సర్పంచ్ వరదప్ప నాయుడు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే గాంధీ, మాజీ మేయర్ కఠారి హేమలత, బీజేపీ నాయకులు చిట్టిబాబు, ధనుంజయ నాయుడు, జనసేన నాయకులు రూప్‌కుమార్, రమేష్, టీడీపీ నేతలు హేమాద్రి నాయుడు, అనిల్‌కుమార్, హరి, మురళీ నాయుడు, గుర్రప్ప నాయుడు, పీటర్, చంద్రమోహన్, మురారి సుధ, బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ ఉద్యోగాలను అమ్ముకున్న జగన్

- పోలీసులకు తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నేతల ఫిర్యాదు



సీఐ విశ్వనాథరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 1: ఏపీపీఎస్సీ ఉద్యోగాలను సీఎం జగన్ రెడ్డి అమ్ముకున్నారని తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నేతలు ఆరోపించారు. ఈమేరకు మంగళవారం స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ విశ్వనాథరెడ్డికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రూప్-1 మెయిన్స్‌కు సంబంధించిన అక్రమాలు హైకోర్టులో బయటపడ్డాయని చెప్పారు. ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతం సవాంగ్, కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులును వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఒక డిప్యూటీ కలెక్టర్ పోస్టు రూ.2.5 కోట్లకు, ఒక డీఎస్పీ పోస్టు రూ.1.5 కోట్లకు అమ్ముకున్నారని చెప్పారు. 30 మంది డిప్యూటీ కలెక్టర్లు, 25 మంది డీఎస్పీ పోస్టులు అక్రమ భర్తీకి పాల్పడ్డారని ఆరోపించారు. గ్రూప్-1 మెయిన్స్‌లో భారీగా అక్రమాలు జరిగాయని, ఆ నోటిఫికేషన్ ద్వారా నియామకమై ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న 162 మంది నియామకాలు చెల్లవని, మళ్లీ గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి 6 నెలల్లోపు నియామక ప్రక్రియను పూర్తి చేయాలని హైకోర్టు తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. గ్రూప్-1 నియామకాల్లో అక్రమాలకు పాల్పడిన సీఎం జగన్ రెడ్డి, ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి మీద కేసునమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. చిత్తూరు పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు కాజూరు రాజేష్, నగర అధ్యక్షుడు యువరాజ్, గౌతమ్, మని, మౌలా, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజి, కార్యదర్శి నాగరాజు, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం సంస్థాన రాజుల చరిత్ర పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత నీలకంఠారెడ్డి

కార్వేటినగరం, ఏప్రిల్ 1: కార్వేటినగరం సంస్థాన రాజుల చరిత్ర పుస్తకాన్ని రచయిత కె. నీలకంఠారెడ్డి కార్వేటినగరంలో సోమవారం ఆవిష్కరించారు. సంస్థాన రాజుల గురించి గత 40 ఏళ్లగా ఎంతో శ్రమకోర్చి అన్వేషించి ఈ పుస్తకాన్ని ఆయన అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చారు. సోమశిల ప్రాజెక్టు రిటైర్డ్ ఇంజనీర్‌గా పనిచేసిన నీలకంఠారెడ్డి గతంలో కార్వేటినగరం జాతర పుస్తకాన్ని కూడా రచించారు. సాహిత్యాభిలాష రచయిత అయిన నీలకంఠారెడ్డి కార్వేటినగరం సంస్థాన జానపద కళలు, రాజుల చరిత్ర పట్ల ఎంతో మక్కువతో విషయ సేకరణ చేశారని ఈ సమావేశంలో పాల్గొన్న ఆరికట్ల సుబ్రమణ్యం తెలిపారు. పుస్తక రచయితను పలువురు ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

ఎన్డీయే కూటమి విజయం తథ్యం: భానుప్రకాష్



ఎన్డీయే కూటమి సమన్వయకమిటీ సమావేశంలో మాట్లాడుతున్న భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 1: ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో ఎన్డీయే కూటమి భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం నగరి పట్టణ పరిధిలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన మిత్రపక్షాల సమన్వయకమిటీ సమావేశంలో భానుప్రకాష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జగన్ అండ్ కో ఘోరాలు.. నేరాలు, మోసాలు, కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, ఓటు అనే ఆయుధంతో వారిని తరిమి కొట్టడం తథ్యమన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఎన్నికల్లో భారీ విజయం సాధించే దిశగా అడుగులు వేయాలని ఆయన కోరారు. బీజేపీ నాయకులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్, నిషిధరాజులు మాట్లాడుతూ నగరి నియోజకవర్గం ఎన్డీయే కూటమి అభ్యర్థి గాలి భానుప్రకాష్ విజయానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మెరుపుల మహేష్, బీజేపీ నాయకులు నారాయణస్వామి నాయుడు, బాబు, రెడ్డిప్రసాద్, విశ్వనాథ్, రామ్మూర్తి యాదవ్, రమేష్ నాయుడు, బాలకృష్ణ టీడీపీ నాయకులు రమేష్‌బాబు, మీరా, బాలాజీ, గుణశేఖర్, శ్రీనివాసన్, శివకుమార్‌రెడ్డి, పురుషోత్తం నాయుడు, గంజి మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి చెప్పే కథలు ప్రజలు నమ్మరు: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి మురళీమోహన్

పూతలపట్టు, ఏప్రిల్ 1: జగన్ రెడ్డి చెప్పే కథలు ప్రజలు నమ్మరని, ఆయన పుట్టక ముందు నుంచే పెన్షన్ వ్యవస్థ ఉందని పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన పూతలపట్టులో మీడియాతో మాట్లాడుతూ రూ.200 పెన్షన్‌ను రూ.2 వేల వరకు పెంచిన ఘనత చంద్రబాబుదేనని కొనియాడారు. వలంటీర్ల వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదన్నారు. వలంటీర్ వ్యవస్థపై వైసీపీ చెడు ప్రచారం చేస్తుందని దుయ్యబట్టారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా కోట్లాది రూపాయల చెల్లింపులు జరిగాయన్నారు. ప్రస్తుతం పెన్షన్‌లు ఇవ్వడానికి ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని, వాటిని కప్పిపుచ్చుకోవడానికి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే రూ.4 వేల పెన్షన్ ఇస్తామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షులు నరసింహులు నాయుడు, జనసేన అధ్యక్షులు మనోహర్, నేతలు మురళి, దేవాజీ, వెంకటముని, యోగేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న బస్సు: ఇద్దరికి గాయాలు



గాయపడిన ఎర్రమ్మ, జయచంద్రారెడ్డి, ప్రమాదానికి కారణమైన బస్సు

వెదురుకుప్పం, ఏప్రిల్ 1: బైకును బస్సు ఢీకొనడంతో తన అన్న, అమ్మ గాయపడ్డారని వెదురుకుప్పం పోలీసులకు సోమవారం గొడుగుచింత గ్రామానికి చెందిన సి. చంద్రమోహన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారు తెలిపిన వివరాల ప్రకారం. వెదురుకుప్పం మండలం గొడుగుచింత గ్రామానికి చెందిన తన అన్న సి. జయచంద్రారెడ్డి(44), అమ్మ ఎర్రమ్మ(66) ఇదే మండలంలోని పచ్చికాపల్లానికి సోమవారం సొంత పనుల నిమిత్తం నుంచి బైక్‌లో వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని స్వగ్రామానికి తిరిగి వస్తుండగా తిరుపతి వైపు నుంచి దేవళంపేటకు వెళ్లే చిత్తూరు ఆర్టీసీ రెండవ డిపో బస్సు వేగంగా వచ్చి కొమరగుంట విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జయచంద్రారెడ్డి, ఎర్రమ్మ గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం రుయాకు తరలించారు. ఈ విషయమై వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

నగరి బార్ కౌన్సిల్ నూతన కార్యవర్గం ఎంపిక



నూతనంగా ఎంపికైన బార్ కౌన్సిల్ సభ్యులు

నగరి, ఏప్రిల్ 1: నగరి జూనియర్ సివిల్ జడ్జి జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టులో నూతన బార్ కౌన్సిల్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ కౌన్సిల్ అధ్యక్షుడిగా ఎం.జె. జగదీష్, ఉపాధ్యక్షుడిగా ఈ.జీ. బాబు, కార్యదర్శిగా రావూరి పురుషోత్తం, ఉపకార్యదర్శిగా అరుణ్, కోశాధికారిగా నాగరాజన్‌లు ఎంపికయ్యారు. జడ్జి విష్ణువర్మ నూతన బార్ అసోసియేషన్‌ను అభినందిస్తూ ప్రశాంత వాతావరణంలో కోర్టు నడవడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మురళీధర్, ఉదయభాను, చిరంజీవులుశెట్టి, మహదేవన్, మణివాసగం, తిరుమలయ్య, త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు నగరంలో రూ.18.57 కోట్ల పన్ను వసూలు

చిత్తూరు, ఏప్రిల్ 1: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.18.57 కోట్ల పన్నులను వసూలు చేశారు. రూ.22.70 కోట్ల డిమాండ్‌కు గాను ఈ ఏడాది 80శాతం పన్నులు వసూలు సాధించామని కమిషనర్ అరుణ తెలిపారు. గతేడాది పాత బకాయిలను కలిపి రూ.27.72 కోట్లు వసూలు చేయడంతో ఈ ఏడాది డిమాండ్ బాగా తగ్గింది. గతేడాది రూ.35కోట్ల డిమాండ్ ఉండగా, ఈ ఏడాది రూ.22.70కి తగ్గింది. కమిషనర్ అరుణ ఆధ్వర్యంలో రెవెన్యూ యంత్రాంగం మూడు నెలలుగా ప్రత్యేక దృష్టి సారించడంతో వసూళ్లవేగం పెరిగింది. ఆఖరు రోజైన ఆదివారం ఒక్క రోజే రికార్డు స్థాయిలో రూ.1.53 కోట్ల పన్ను వసూలైంది.

ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 1: నిత్య సేవాతత్పరు లు నగరానికి చెందిన మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు అని జి ల్లా సీనియర్ సివి ల్ జడ్జి కరుణకుమార్ అన్నారు. సోమవారం స్థానిక గిరింపేటలోని చౌడేశ్వరమ్మ ఆలయం వద్ద పార్థసారథి నాయుడు ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని కరుణకుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి తాపాన్ని తీర్చేందుకు ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సాధారణ విషయం కాదన్నారు. ఈ సేవలను కొనసాగించాలని ఆయన కోరారు. అనంతరం పార్థసారథి నాయుడు మాట్లాడుతూ ప్రతి ఏడాది తన జన్మదినం రోజున ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. వేసవి ముగిసే వరకు నగర వాసులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తానని పేర్కొన్నారు. ఆలయం వద్ద అన్నదానం చేశారు. అనంతరం జడ్జి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీవీకేఎన్ వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీకే విశ్వనాథ్, విశ్రాంత ఎస్ఐ మురళి తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి వార్డు సచివాలయాల్లో పెన్షన్ల పంపిణీ



మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు, ఏప్రిల్ 1: నగరపాలక సంస్థ పరిధిలో సామాజిక పెన్షన్ల పంపిణీకి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని, పెన్షన్ లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నగర కమిషనర్ అరుణ చెప్పారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి సంబంధిత వార్డు సచివాలయాల్లో వార్డు కార్యదర్శుల ద్వారా సామాజిక పెన్షన్ల పంపిణీ జరుగుతుందన్నారు. నగరపాలక పరిధిలో మొత్తం 16,697 పెన్షన్లకు సంబంధించి వార్డు సచివాలయం పరిధిలో క్లస్టర్లవారీగా కార్యదర్శులను కేటాయించామన్నారు. లబ్ధిదారులంతా నిర్దేశించిన సమయంలో వార్డు సచివాలయానికి వచ్చి పెన్షన్లను తీసుకోవాలన్నారు. నడవలేని వారికి, బెడ్ రీడన్ పేషెంట్లకు ప్రభుత్వ నిబంధనల మేరకు పెన్షన్లను అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంఎం గోపి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

ఐరాల, ఏప్రిల్ 1: మండలంలోని బీరప్పచెరువులోని ఎంపీయూపీ పాఠశాలలో సోమవారం పలువురు విద్యార్థులకు బహుమతులను అందించారు. పాఠశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి 60 బహుమతులను రూ.6,000 ఖర్చుతో దాతలు మన్యం శివ, వెంకటేష్, సాయిరామ్, రవిరెడ్డి గ్రామానికి చెందిన యువత తరపున బహుమతులు అందించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ విద్యార్థులు ఐక్యమత్యంగా ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థి చక్కగా చదువుకుని పరీక్షలు చక్కగా రాయాలన్నారు. ఆటలలో బాగా రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు జయరామ్, హరిత, వినాయక, కపిలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతిని అందిస్తున్న మన్యంశివ, హెచ్‌ఎం ఉషారాణి